E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా


విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: TELANGANA   సంపుటి : 01   సంచిక : 119 సోమవారం, ఏప్రిల్ 06, 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 08   వెల :05/-

## విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

**- అసోం సభలో రాహుల్ గాంధీ విమర్శ**



**గౌహతీ ఏప్రిల్ 05:** ప్రజల మధ్యన విభజన తీసుకొచ్చి రాజకీయ లబ్ది పొందేందుకు బీజేపీ విద్వేషం వ్యాప్తి చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో అసోంలోని బిశ్వనాథ్ చరియాలీలో ఆదివారం నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను విద్వేషం విరజిమ్మే నేతగా ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే.. హిమంత క్షమాపణలు కోరినా.. వదిలిపెట్టబోమని, చట్టపరంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మిగతా2లో...

## ఎల్పీజీ కష్టాలు

**కిలో రూ.500కి చేరిక**

**భారంగా 'ఛోటా' సిలిండర్**

**పేదలు, వలస కార్మికులకు తప్పని తిప్పలు**

**బ్లాక్ మార్కెట్ దందాను కట్టడి చేయలేని ప్రభుత్వాలు**


2లో


## అమెరికాకు మరో ఎదురు దెబ్బ

**రెస్క్యూ విమానాన్ని కూల్చేసిన ఇరాన్..ఐదుగురు మృతి**

**దిగిరాకుంటే నరకమే : ట్రంప్ అల్టిమేటం**

**పట్టించుకోని టెహ్రాన్**

**గల్ఫ్‌పై కొనసాగుతున్న దాడులు**



**ఇరాన్, ఏప్రిల్ 05:**ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో అమెరికా దళాలకు మరో ఎదురు దెబ్బ తగిలింది. అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేయడం, దానిలో ఉన్న ఇద్దరు పైలట్లలో ఒకరు గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన రెస్క్యూ విమానాన్ని కూడా కూల్చేశామని మిగతా2లో...

## నేర్చుకోవడమే న్యాయవ్యవస్థకు

# దిక్సూచి

**● బుద్వేలులో హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన ● కార్యనిర్వాహక వ్యవస్థతో కలిసి పనిచేయాలి ● అప్పుడే రాజ్యాంగం సజీవం: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 05:** రాజ్యాంగం సజీవంగా ఉండాలంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ లక్ష్యాల విషయంలో ఏకీభవించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలనేవి ఐచ్ఛికం కాదనీ, అత్యవసరమేననీ, వాటిని బలోపేతం చేయటం తప్పనిసరి అని అన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషిని కొనసాగిస్తున్నాయని ప్రశంసించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని బుద్వేల్‌లో రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి జస్టిస్ సూర్యాకాంత్ మిగతా2లో...



## భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత

**ఆరు శాతానికి తగ్గింపు : మూడీస్ నివేదిక**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 05:** మూడీస్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాలను 6శాతానికి తగ్గించింది. గతేడాది ఆర్థిక వృద్ధి 6.8 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో వృద్ధి వేగం మందగిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉందని మూడీస్ పేర్కొంది. భారతదేశ క్రెడిట్ రేటింగ్స్‌పై నివేదికను మూడీస్ ఆదివారం విడుదల చేసింది. యుద్ధం కారణంగా దీర్ఘకాలిక అంతరాయాలు ముఖ్యంగా ఎల్‌పీజీ రవాణా కారణంగా భవిష్యత్తులో గృహాలకు ఎల్‌పీజీ కొరత, అధిక ఇంధన, రవాణా ఖర్చులకు అలాగే దిగుమతి చేసుకున్న ఎరువులపై భారత్ ఆధారపడటంతో ఆహార ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని పేర్కొంది."పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అధిక ధరలు, పెరిగిన మిగతా2లో...

## నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూకుంభకోణం

**373 ఎకరాల భూమిని తన్నుకుపోతున్న కాంగ్రెస్ పెద్దలు**

**కబ్జా కంపెనీల వెనుక మంత్రి పొంగులేటి కుటుంబం**

**అధికార పార్టీ నేతల ఆక్రమణలు హైడ్రాకు కనిపించడం లేదా?**

**ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకోకుంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో అక్కడికి వెళ్తాం : మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక**


2లో

## జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది

**- ఏపీ మంత్రుల తీవ్ర విమర్శలు**



**అమరావతి, ఏప్రిల్ 05:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోందని పార్థసారథి వ్యాఖ్యానించారు. విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు మిగతా2లో...


## నేడు బిజెపి ఆవిర్భావ దినోత్సవం

**కమలనాథులు చురుగ్గా పాల్గొనాలి**

**ప్రతి ఇంటిపై జెండా రెపరెపలాడాలి: పార్టీ చీఫ్ రాంచందర్ రావు పిలుపు**



**హైదరాబాద్ ఏప్రిల్ 05:** బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమ వారం (6న) పార్టీ శ్రేణులు పార్టీ నిర్దేశిం చిన వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని, ఇంటి యజమాని అనుమతితో వారి ఇంటిపై పార్టీ జెండా ఎగుర వేయాలని ఆయన సూచించారు. దీంతో జాతీయ గౌరవ భావన, ప్రజా భాగస్వామ్యం, పార్టీ పట్ల ప్రజల ఆత్మీయ అనుబంధం మరింత బలపడుతోంది. అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమానికి ఎంతో సానుకూల స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు.దేశవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు ఘనంగా జరుపుకోనున్నారని ఆయన చెప్పారు. వేడుకలకు ముందు రోజే ప్రతి బూత్‌లో, ప్రతి ప్రాంతంలో పార్టీ కార్యకర్తలు ఇప్పటికే పార్టీ జెండాను ఆవిష్కరించడం ప్రారంభించి, పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి మిగతా2లో...



## తెలంగాణ సక్సెస్‌ఫుల్ స్టార్టప్

**ఎఐ, లైఫ్‌సైన్సెస్, ఫిన్‌టెక్, అగ్రిటెక్ తదితర రంగాల సమ్మేళనంతోనే వృద్ధి సాధ్యం విదేశాల్లోని మన విద్యార్థులు, నిపుణులు భారత అభివృద్ధిలో భాగస్వాములు కావాలి కొలంబియా బిజినెస్ స్కూల్ 'ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్'లో కెటిఆర్ ప్రసంగం**

**హైదరాబాద్ ఏప్రిల్ 05:** స్వతంత్ర భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభివర్ణించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో జరిగిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను మిగతా2లో...

## ఆప్ నేతలకు రాఘవ చద్దా కౌంటర్

**- సినిమా ఇంకా ఉందని వీడియోలతో ఎదురుదాడి**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 05:**పంజాబ్ వేదికగా ఆమ్ ఆద్మీపార్టీలో సంక్షోభం ముదిరింది. ఆప్ రాజ్యసభ సభ్యులు ఎంపి రాఘవ చద్దా ఆదివారం పార్టీ నాయకత్వంపై ఎదురుదాడికి దిగారు. సినిమా అయిపోలేదు. ఇంకా మిగిలే ఉంది. పైగా ఇప్పుడే అసలు సినిమా అంటూ వీడియోలు విడుదల చేశారు. పార్లమెంట్‌లో పంజాబ్ సమస్యలను రాఘవ ప్రస్తావించడం లేదనే పార్టీ అంతర్గత వాదనను మిగతా2లో...

# ఎల్పీజీ కష్టాలు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 05:** మధ్యప్రాచ్య యుద్ధం వల్ల ఎల్పీజీ సరఫరా తీవ్రంగా ప్రభావితమైంది. 14.2 కిలోల గృహ సిలిండర్ బ్లాక్ మార్కెట్‌లో రూ.3000 వరకు అమ్ముడవుతోంది. అధికార ధర మాత్రం రూ.914 మాత్రమే. 5 కిలోల సిలిండర్ రీఫిల్ ధర కిలోకు రూ.400-500కు పెరిగింది. ఈ పరిస్థితిలో చిన్న సిలిండర్ ధర పెద్దదాని కంటే ఎక్కువైంది. అందుకే 'ఛోటా' సిలిండర్ ఇప్పుడు 'పెద్దది'గా మారిందని భావిస్తున్నారు. వలసకార్మికులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు ఈ ఐదు కిలోల సిలిండర్‌పై ఆధార పడుతుంటారు. కానీ ప్రస్తుత ధరల వల్ల రీఫిల్ చేయించడం మోయలేని భారంగా మారుతోంది. నోయిడాకు చెందిన పునీత్‌కుమార్ తన పాత ఐదు కిలోల చోటు సిలిండర్‌ను తిరిగి ఉపయోగించాలని భావించాడు. కానీ ఎల్పీజీ కొరత కారణంగా దాన్ని రీఫిల్ చేయించుకోలేకపోయాడు. ధరలు చాలా ఎక్కువగా ఉండటంతో, సాధారణ 14 కిలోల సిలిండర్ కోసం వేచి ఉండడమే మంచిదనుకున్నాడు. నోయిడాలోని రాహుల్ రంజన్ కూడా కిలోకు రూ.400 చెల్లించాలని అడిగారని చెప్పారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) చట్టబద్ధంగా 'చోటు', 'మినీ', 'అప్పు' అనే ఐదు కిలోల సిలిండర్లను అందిస్తున్నాయి. కానీ వాటి లభ్యత సమస్యగా మారడం ఆందోళనకరమని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రభుత్వం సరఫరా నిలకడగా ఉంటుందని చెప్పినా.. చాలా చోట్ల పది నుంచి 45 రోజుల వరకు సిలిండర్ డెలివరీ ఆలస్యం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ కోసం ప్రజలు గొడవలకు దిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా చిన్న సిలిండర్‌పై ఆధారపడే వలస కార్మికులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. అధిక ధరల కారణంగా కొంతమంది తమ గ్రామాలకు తిరిగి వెళ్లిపోయారు. నోయిడాలోని ఒక స్ట్రీట్ ఫుడ్ విక్రేత గ్యాస్ కొనలేక బొగ్గు స్టవ్‌కు మారాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆ తర్వాత అతను స్వగ్రామానికి వెళ్లిపోయాడు. చిన్న సిలిండర్ ఒకప్పుడు మధ్యతరగతి వారికి గుర్తుగా ఉండేది.ఇప్పుడు అదే పేదలకు జీవనాధారం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని పొందడం కష్టమైంది. ముంబయి, ఢిల్లీ వంటి నగరాల్లో చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు ఈ సిలిండర్లపై ఆధారపడుతుంటారు. కానీ ఇప్పుడు వాటి రీఫిల్ ధరలు అధికంగా ఉండటంతో వ్యాపారం కొనసాగించడం కష్టమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్లాక్ మార్కెట్ దందా సాగుతోంది. పోలీసులు బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా.. అక్రమ దందా మాత్రం ఆగటం లేదు. ప్రభుత్వం ఈ మినీ సిలిండర్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. వలస కార్మికులకు 30,000 సిలిండర్లు పంపిణీ చేశారు. మార్చి 23 తర్వాత 3.9 లక్షల సిలిండర్లు అమ్ముడయ్యాయి. అయితే ధర కూడా పెరిగి రూ.649కు ఎగబాకింది. ఈ సిలిండర్లు సులభంగా పొందవచ్చని కంపెనీలు చెప్తున్నా.. వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. చాలా చోట్ల అవి అందుబాటులో లేవని ప్రజలు చెప్తున్నారు. బుకింగ్ చేసినా స్టాక్ లేదని చెప్పడం, హెల్ప్‌లైన్ పని చేయకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ప్రకటించారు. పైలట్‌ను రక్షించామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత ఇరాన్ మీడియా ఓ వార్తను అందిం చింది. దాని ప్రకారం...కూలిపోయిన యుద్ధ విమానానికి చెందిన పైలట్ కోసం గాలింపు జరుపుతున్న అమెరికా రెస్క్యూ విమానం సీ-130ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ ధ్వంసం చేసింది. ఖతార్ మీడియా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. గాలింపు చర్యలు చేపట్టిన విమానాలకు రీఫ్యూయలింగ్ చేయడానికి సీ-130 వచ్చింది. అయితే అందులోని సిబ్బంది ఏమైందీ తెలియలేదు. గాలింపు సమయంలో ఇరాన్ దళాలు అనేక అమెరికా విమానాలను ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా ఇరాన్ దళాలు జరిపిన దాడులలో ఐదుగురు చనిపోయారు. కూల్చివేతకు గురైన వాటిలో సీ-130 విమానంతో పాటు రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు కూడా ఉన్నాయి. **పైలట్‌ను రక్షించాం : ట్రంప్** ఇరాన్‌లో చిక్కుపోయిన రెండో పైలట్‌ను రక్షించామని, ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వతాల్లో అతనిని గుర్తించారని, ప్రస్తు తం అతను అమెరికా బలగాల రక్షణలో ఉన్నాడని తెలిపా రు. పైలట్‌ను తీసుకొని రావడానికి ప్రపంచంలోనే అత్యం త ప్రాణాంతక ఆయుధాలతో అనేక విమానాలను పంపా మన్నారు. పైలట్ గాయపడినప్పటికీ కోలుకుంటు న్నాడని చెప్పారు. **ఇరాన్ సీనియర్ అధికారులను చంపేశాం** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై జరిపిన దాడులలో ఆ దేశానికి చెందిన పలువురు సీనియర్ సైనికాధికారులు చనిపోయారని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దాడికి సంబంధించి ఒక నిమిషం ఏడు సెకన్ల నిడివి కలిగిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. అందులో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలము కున్నాయి. అయితే ఈ దాడులు ఎప్పుడు జరిగిందీ ట్రంప్ వెల్లడించలేదు. తమతో ఒప్పందం చేసుకొని, హర్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో నరకాన్ని చవిచూడాల్సి ఉంటుందంటూ హెచ్చరిక జారీ చేసిన తర్వాత ట్రంప్ ఈ వీడియోను విడుదల చేయడం గమనార్హం. ఇరాన్ కూడా ఈ దాడులపై ఇంతవరకూ స్పందించలేదు. ఇదిలావుండగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ కమాండర్ ఖస్సెమ్ సోలైమని బంధువుగా గుర్తించిన ఓ మహిళ శాశ్వత నివాస హోదాను అమెరికా రద్దు చేసింది. సొలైమని బంధువు హమిదెహ్ సొలైమని అఫ్షర్‌ను, ఆమె కుమార్తెను ఇమ్మిగేషన్ అధికారులు నిర్బంధించారని, వారిని దేశం నుంచి బయటికి పంపే ప్రయత్నం జరుగుతోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. **కువైట్ చమురు సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ దాడి** గల్ఫ్‌లోని కువైట్‌పై ఇరాన్ ఆదివారం విరుచుకు పడింది. షువైఖ్ చమురు సెక్టార్ ప్రాంగణంపై డ్రోన్ దాడి జరిపింది.

# నేర్చుకోవడమే న్యాయవ్యవస్థకు దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలో నే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కోర్టు గదులు, పరిపాలనా భవనాలు, ఆర్కైవ్స్, నివాస మౌలిక సదుపాయాలు, శిక్షణా కేంద్రాలన్నింటినీ సకల సౌకర్యాలతో ఒకే ప్రాంగణంలో నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించటం అభినందనీయమన్నారు. న్యాయవ్యవస్థ తన సొంత నిబంధనల ప్రకారం, తన సొంత పరిధిలో పనిచేస్తుందని చెప్పారు. మనం సిద్ధాంతం నుంచి ఆచరణలోకి మారినప్పుడు సంస్థాగత స్వయం సమృద్ధి ఇలాగే ఉంటుందనీ, నేర్చుకోవడం మానేస్తే న్యాయవ్యవస్థ పరిణామం చెందడం కూడా ఆగిపోతుందని వివరించారు. హైకోర్టు ఆడిటోరియంలో జిల్లాల న్యాయ సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్న సెంట్రల్ రికార్డ్ రూమ్ కూడా అంతే ముఖ్యమైనదనీ, భద్రపరిచిన, అందుబాటులో ఉన్న పూర్వ తీర్పులు, ఆ తర్వాత వచ్చే ప్రతి తీర్పునూ బలోపేతం చేస్తాయని చెప్పారు. దీనికి తగినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇవ్వటం హర్షణీయమంటూ ప్రభుత్వ ప్రణాళికను ప్రసంసించారు. సుస్థిర మౌలిక సదుపాయాలను మొదటి నుంచే డిజైన్‌లో పొందుపరిచారన్నారు. ఈ భవనం తరతరాల న్యాయమూర్తులకు, వ్యాజ్యదారులకు సేవలందించే ప్రాంగణం కాబట్టి ఈ భూమిని గౌరవించాలని సూచించారు. కొత్త భవనం కోసం వందెకరాలు కేటాయించడమేగాకుండా, ఈ ప్రాజెక్టుకు రూ.2,500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ ధన్యవాదాలు తెలిపారు.రాబోయే వందేండ్ల పాటు సేవలందించేలా రూపొందించిన ఈ కొత్త హైకోర్టు ప్రాంగణం రెండేండ్లలో పూర్తవుతుందని చెప్పారు. 2024లో శంకుస్థాపన చేసిన జోన్-1 పురోగతిపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ, జోన్-2 కూడా మరో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, ఉజ్జల్ భూయాన్, ఎస్‌వీ భట్టి, అలోక్ అరధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రోడ్లు, భవనాల శాఖ సెక్రెటరీ వికాస్‌రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌జీ కర్ణన్, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఈ భవన నిర్మాణ డ్రాయింగ్‌లు, కోర్టు నమూనాలను సీజేఐ, సీఎం తదితరులు పరిశీలించారు. **ప్రార్థనా మందిరాలకంటే పవిత్రం : సీఎం రేవంత్‌రెడ్డి** కోర్టును నిర్మిస్తే ఒక పవిత్ర స్థలాన్ని నిర్మించినట్టే. గుడి, మసీదు, చర్చి కంటే ఎక్కువగా అన్ని మతాల వారందరికీ ఇది ఒక పవిత్రమైన ప్రదేశం. తన ప్రజా జీవితంలో ఈ శంకుస్థాపన సందర్భాన్ని ఒక అరుదైన, చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది.

# నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూకుంభకోణం

**హైదరాబాద్, ఏప్రిల్ 05:** హైదరాబాద్‌లోని నాదర్‌గుల్‌లో రూ.ఏడు వేల కోట్ల విలువైన భూకుంభకోణం జరిగిందని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. అక్కడ సర్వేనెంబర్ 613 (కొత్త సర్వే నెంబర్ 119)లో ఉన్న 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని అన్నారు. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు, మంత్రులున్నారని ఆరోపించారు. అందుకే రక్షకులే భక్షకులుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములుగా ప్రకటించాలని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు లేఖ రాస్తే నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ప్రభుత్వ భూములుగా అసెంబ్లీలో ప్రకటించి ఏపీఐఐసీకి అప్పగించారని గుర్తు చేశారు.కౌసల్య, మమత వంటి మహిళా రైతులు 40 ఏండ్లుగా ఆ భూమినే నమ్ముకుని బతుకుతున్నారని వివరించారు. వారికి రూ.ఐదు లక్షలు, రూ.పది లక్షలు ఆశ చూపి వెళ్లగొట్టాలని చూస్తున్నారనీ, బోర్లు, కంచెలను ధ్వంసం చేశారని అన్నారు. నాదర్‌గుల్ భూములు శివరాజ్ బహదూర్‌వేనని ఆయన చెప్పినా 2005లోనే ఆర్డీవో ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారని చెప్పారు. 2017లో హైకోర్టు కూడా ఇది ప్రభుత్వ భూమి అంటూ చెప్పిందన్నారు. ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలుండే అవకాశం లేదనీ, అయినా 2016లో శివరాజ్ బహదూర్ ఆ భూములను ఆల్ఫా, ఒమేగా, యునిటెక్ కంపెనీలకు విక్రయించారని అన్నారు. చట్టంలోని సెక్షన్ ఎనిమిది, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా భూములను అమ్మే హక్కు లేదన్నారు.ఆ విక్రయాలు చెల్లవనీ, ఇది సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంటుందని కందుకూరు ఆర్డీవో తేల్చిచెప్పారని గుర్తు చేశారు. ఆర్డీవో నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆ కంపెనీలు హైకోర్టుకు వెళ్తే ఆర్డీవో నిర్ణయమే సరైనదనీ, ఆ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ స్పష్టం చేశాయని వివరించారు. అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వాళ్లు సుప్రీంకోర్టుకు వెళ్లారనీ, ప్రస్తుతం జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం వద్ద ఆ కేసు మంగళవారం విచారణకు రానుందని అన్నారు. భూభారతి పోర్టల్‌లో చూసినా అది ప్రభుత్వ భూమి ప్రొహిబిటెడ్ ల్యాండ్‌గానే చూపిస్తోందని వివరించారు.చెరువులను కాపాడుతున్నానని చెప్పే రేవంత్‌రెడ్డికి నాదర్‌గుల్ భూకబ్జాలు కనిపించడం లేదా?అని ప్రశ్నించారు. ఈ భారీ భూ కుంభకోణం, భూ కబ్జా కంపెనీల వెనుక రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబమే ఉందని ఆరోపించారు. పేదల ఇండ్లు కూలగొట్టే 'హైడ్రా'కు అధికార పార్టీ నేతల కబ్జాలు, చెరువుల ఆక్రమణలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కబ్జాదారులను అరెస్ట్ చేసి, రైతులను భూముల్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. నాదర్‌గుల్ భూములపై సోమవారం ఉదయం వరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకోకపోతే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి అక్కడికి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ అన్నారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా రాహుల్ పేర్కొన్నారు. అసోంకు చెందిన సుప్రసిద్ధ గాయకుడు, కీర్తిశేషులు జుబిన్ గర్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు.తమ కాంగ్రెస్ పార్టీ భావజాలం కూడా అలాంటిదేనని, ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే తమ సిద్ధాంతమని తెలిపారు. అస్సాంలో తాము అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో దోషులను 100 రోజుల్లోగా శిక్షిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక తరగతులకు షెడ్యూలు తెగ (ఎస్టీ) హోదా ఇస్తామని, తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు రాష్ట్ర ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంగా మార్చేశారని విమర్శించారు.

# భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత

(మొదటి పేజీ తరువాయి)

ముడి సరుకుల వ్యయాల మధ్య ప్రయివేట్ వినియోగం క్షీణించడం, స్థూల స్థిర మూలధన నిర్మాణం బలహీనం కావడం భారతదేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం దృష్ట్యా 2026-27లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు గతంలో 6.8 స్థాయి నుండి తగ్గి 6శాతానికి పరిమితమవుతుందని అంచనావేస్తున్నాం" అని మూడీస్ నివేదిక తెలిపింది."ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నప్పటికీ.. భౌగోళిక, రాజకీయ ఇబ్బందులు ద్రవ్యోల్బణ అంచనాలను పెరుగుదల దిశగా మళ్లించాయి" అని మూడీస్ పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2.4శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2027లో సగటున 4.8శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణ ముప్పు తలెత్తడం, వృద్ధి బలంగా కొనసాగడంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో పాలసీ రేట్లు స్థిరంగా కొసాగవచ్చు లేదా క్రమంగా పెరగవచ్చు అని పేర్కొంది. పెరిగిన చమురు, గ్యాస్, ఎరువల ధరలు నిర్దేశిత సబ్సిడీపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తాయని, ఫలితంగా బడ్జెట్‌తో పోలిస్తే రాబడి క్షీణతతో పాటు అధిక వ్యయాలకు దారితీయవచ్చని పేర్కొంది.

# జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌కు లేదని అన్నారు. మంగళగిరిలో మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడలేదని, కానీ జగన్‌ను చూస్తే ఆయనే గుర్తుకొస్తున్నారని చెప్పారు.మూడు రాజధానుల పేరుతో ఆయన మూడు ముక్కలాట ఆడారని పార్థసారథి విమర్శించారు. తాను చెప్పిందే అందరూ వినాలనే ధోరణివల్లే ప్రజలు ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అలాంటి రైతులను అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. మరోవైపు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తెలుగు జాతిపైన, అమరావతిపైన జగన్‌కు ఎందుకంత కక్ష..? అని ప్రశ్నించారు. జగన్ మొదట అమరావతిని రాజధానిగా అంగీకరించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించామని ఆయన చెప్పారు. జగన్‌కు విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అన్నారు.

# నేడు బిజెపి ఆవిర్భావ దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్ళడం సంతోషకరమని అన్నారు.బిజెపి కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని జాతీయ సేవ, జాతీయత, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిబద్ధత అనే విలువలతో ముందుకు సాగే ఒక మహత్తర జాతీయ ఉద్యమం అని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త దేశం ముందు - పార్టీ తరువాత - స్వయం చివర అనే భావంతో, పార్టీ సిద్ధాంతాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని ఆయన తెలిపారు. నలభై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని నలభై ఆరు సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తమ పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలవడం మనందరికీ గర్వకారణం అని ఆయన వివరించారు. గతంలో జనసంఘ్‌గా ప్రారంభమైన ఈ ప్రయాణం, 1980లో ముంబైలో అటల్ బిహారీ వాజపేయి అధ్యక్షతన భారతీయ జనతా పార్టీగా రూపుదిద్దుకుని, తన సిద్ధాంత బలం, క్రమశిక్షణ గల కార్యకర్తల శ్రమ, జాతీయ సేవ పట్ల అచంచల నిబద్ధతతో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని రాంచందర్ రావు వివరించారు.దేశంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చామని, అంతేకాక, రాబోయే కాలంలో కూడా మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రజలు నిర్ణయించుకున్నట్టుగా స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన తెలిపారు. అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రులైన తర్వాతనే భారత్ నిజమైన ఆర్థిక మార్పును, అభివృద్ధి యొక్క కొత్త యుగాన్ని చూడడం ప్రారంభించిందని ఆయన వివరించారు. వారిరువురి నాయకత్వం దేశానికి కొత్త దిశను చూపి, అభివృద్ధిని వేగవంతం చేసి, మరింత బలమైన, ఆత్మనిర్భరమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది వేసిందని రాంచందర్ రావు తెలిపారు.

# తెలంగాణ సక్సెస్‌ఫుల్ స్టార్టప్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించి తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని ఆయన వివరించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత దశాబ్ద కాలం పాటు జరిగిన అభివృద్ధి గురించి కెటిఆర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం ద్వారా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనం. తాము అవకాశాల కోసం ఎదురు చూడలేదు అని, వాటిని అందిపుచ్చుకునేందుకు అద్భుతమైన పాలసీలను తయారు చేశామని తెలిపారు.

# ఆప్ నేతలకు రాఘవ చద్ధా కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన తోసిపుచ్చారు. పార్లమెంట్‌లో తన ప్రసంగాలను తెలియచేస్తూ తాజాగా మూడు నిమిషాల వీడియోను వెలువరించారు. నిజానిజాలు ఈ దృశ్య శ్రవణ సాధనాలు తెలియచేస్తామని స్పందించారు. తనకు వ్యతిరేకంగా పార్టీలో తప్పుడు కథలతో ప్రచారానికి దిగుతున్నారని, దీనికి తాను ప్రతిస్పందన ఇచ్చుకోవల్సి ఉంటుందని తెలిపారు. రాజ్యసభలో ఆప్ ఉపనేత పదవి నుంచి ఇటీవల ఆయనను తొలిగించారు. ఇది వివాదాస్పదం అయింది. పంజాబ్ విషయాలను తాను ప్రస్తావించడం లేదని చెప్పడం కించపర్చడమే అని పేర్కొన్నారు. పంజాబ్ తనకు ఓ మైక్ అనుకోరాదని, అంతకు మించి ఓ ఇల్లు, తన ఆత్మ అని తెలిపిన రాఘవ పంజాబ్ కోసం స్పందించడం తన బాద్యత అని తేల్చిచెప్పారు. రైతులకు కనీస మద్దతు ధరలు, భగత్ సింగ్‌కు భారత్ రత్న, భూగర్భ జలాల తగ్గుముఖం, నన్‌కానా సాహిబ్ కారిడార్ వంటి విషయాలపై మాట్లాడానని తెలిపారు. సంబంధిత వీడియోలు అందరి ముందుంచుతున్నాను మిత్రమా అని సవాలు విసిరారు. పంజాబ్ ఎమ్మెల్యేలు ఎన్నుకోవడం వల్లనే రాజ్యసభకు చద్ధా వెళ్లారని, అయితే ఆయన పల్లెతు మాట కూడా పంజాబ్ కోసం మాట్లాడటం లేదని పంజాబ్‌లోని ఆప్ నాయకత్వం విమర్శిస్తోంది. ఆయన మౌనం దేనికి సంకేతం అని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఆప్ పంజాబ్ విభాగం అధ్యక్షులు అమన్ ఆరోరా , సీనియర్ నేత కుల్దీప్ సింగ్ ధాలీవాల్ చేస్తున్న విమర్శలకు ఇప్పుడు గౌరవప్రదంగానే రాఘవ కౌంటర్ ఇచ్చారు.

# వృద్ధులకు ఆపన్నహస్తం -- ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ సేవలు





**తెలుగు గళం న్యూస్ జనగామ ఏప్రిల్ 05**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారామపురం గ్రామంలోని ప్రేమ సదన్ వృద్ధాశ్రమంలో ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన చుక్క పరమేష్ పాల్గొని వృద్ధులకు ఆహార పదార్థాలు పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు.కీర్తిశేషులు చుక్క ఐలయ్య--లక్ష్మి కుమారుడైన పరమేష్, ఆశ్రమంలోని వృద్ధుల పరిస్థితిని గమనించి మనసు కలచివేసుకుని వారికి 20 బ్రెడ్ ప్యాకెట్లు, 20 టిఫిన్లు, 20 బిస్కెట్ ప్యాకెట్లు మరియు అరటి పండ్లు అందించారు. ఈ సందర్భంగా వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తూ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు పెదపూడి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, తండ్రి జ్ఞాపకార్థంగా వృద్ధులకు సేవలు అందించిన పరమేష్‌ను అభినందించారు.ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అలవల బిక్షపతి, దండు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.ఫౌండేషన్ ద్వారా ప్రతి వారం నిర్వహిస్తున్న సేవలను వృద్ధులు ప్రశంసిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు.దాత చుక్క పరమేష్ మాట్లాడుతూ, ఈ సేవా కార్యక్రమానికి అవకాశం కల్పించిన ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.తన తండ్రి జ్ఞాపకార్థంగా వృద్ధులకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

# జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో పని చెయ్యాలి



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు కొరకు ప్రభుత్వం చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వాతంత్ర సమరయోధుడు.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి.. నిరంతర శ్రామికుడు.. మొదటి కార్మిక శాఖ మంత్రివర్యులు...భారత దేశ మాజీ ఉప ప్రధాని డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపీకృష్ణ , తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కమ్మగాని కృష్ణమూర్తి గౌడ్ పాల్గొన్నారు. సామాజిక న్యాయం సమానత్వం కొరకు దేశ స్వతంత్ర కొరకు పోరాటం చేసిన మహనీయుడని వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత పోరాడాలని దేశ సమైక్యతలో దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు బాబు జగ్జీవన్ రావని ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు.

## కేసీఆర్ కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి.. ప్రజా ఆస్తుల ధ్వంసంగా పరిగణించాలి..!

**ఆలేరు టౌన్, ఏప్రిల్ 5 :** గజ్వేల్‌లోని కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ప్రభుత్వ విప్ ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అభివర్ణించారు. గజ్వేల్ క్యాంప్ కార్యాలయంపై దాడిని నిరసిస్తూ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి బీఆర్ఎస్ సైనికులతో కలిసి ఆదివారం ఆలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ధ్వంసం చేయడం అంటే ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడమే అని ఆమె కాంగ్రెస్ సర్కార్ పై ధ్వజమెత్తారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాదులోని బేగంపేటలో క్యాంప్ కార్యాలయానికి ప్రగతి భవన్‌గా నామకరణం చేశారని, రాష్ట్రానికి ఎవరు సీఎం అయినా భవన్‌లో ఉండే విధంగా ఏర్పాటు చేస్తే, ఈరోజు రేవంత్ రెడ్డి అందులో ఉండడానికి నామోషీగా భావించి, ఆ భవన్నా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి సీతక్క కోసం ఏర్పాటు చేశారని గొంగిడి సునీత మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కూడా క్యాంప్ కార్యాలయానికి రాకుండా రేవంత్ రెడ్డి అడుగుజాడల్లోనే నడుస్తున్నారని ఆమె ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు వందల కోట్లు వెచ్చించి.. అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు పథకం ప్రకారం నిర్వహించిన దాడి అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా .. ముందు మీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్యాంపు కార్యాలయాల్లో ఉంటున్నారా లేదా తెలుసుకోవాలని ఆమె నాయకులను హెచ్చరించారు. బీఆర్ఎస్ జోలికి వస్తే ఉక్కు పాదంతో అణచివేస్తామని ఆమె తేల్చి చెప్పారు.

# హైదరాబాద్‌లో కుల నిర్మూలన కోసం మారథాన్ కార్యక్రమం

**సమ సమాజం కోసం నినాదాలు... పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు**




**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఏప్రిల్ 5**

కుల నిర్మూలనతోనే సమ సమాజ నిర్మాణం సాధ్యమని పిలుపునిస్తూ ఆదివారం నగరంలో భారీ మారథాన్ వాక్ నిర్వహించారు. నెక్లెస్ రోడ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్తంగా నిర్వహించాయి.ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ మారథాన్‌ను మాజీ న్యాయమూర్తి రాధారాణి జెండా ఊపి ప్రారంభించారు. “కులం వద్దు--మానవత్వం ముద్దు”,“కుల గోడలను కూల్చుదాం--నవ సమాజం నిర్మిద్దాం” వంటి నినాదాలతో పాల్గొన్నవారు ఉత్సాహంగా నడిచారు.పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, యువత, దంపతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కుల దురహంకార హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కులాంతర, మతాంతర వివాహితుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరమని పేర్కొన్నారు.అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క మాట్లాడుతూ కుల, మత భేదాలు లేని సమాజం కోసం సాంస్కృతిక ఉద్యమాలు అవసరమని తెలిపారు.చిన్ననాటి నుంచే సమానత్వ విలువలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు.ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను గుర్తు చేస్తూ కుల వ్యవస్థపై సాంస్కృతిక మార్పు అవసరమని చెప్పారు. కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు వహీద్ కులం సమాజ అభివృద్ధికి అడ్డంకి అని పేర్కొన్నారు.కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కుల నిర్మూలన కోసం భావజాల పోరాటాలు విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 11 నుంచి 14 వరకు నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు.అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్ వరకు సాగిన ఈ మారథాన్ అనంతరం సభ నిర్వహించారు. టి పి ఎస్ కె రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాముసూరు గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలు



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 05**

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం పాముసూరు గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావు 119వ జయంతి ఘనంగా నిర్వహించారు.సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ రాజకీయ నాయకుడు మరియు సంఘసంస్కర్త స్వాతంత్ర్య సమరయోధుడు మరియు మాజీ భారతదేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ తన చిన్న వయసులోనే దేశ పార్లమెంటులో మంత్రిగా దాదాపు అన్ని శాఖలను నిర్వర్తించారు.50 సంవత్సరాల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా ఎదిగి దేశానికి ఎంతగానో సేవలు చేసి ఎస్సి బిసి మైనార్టీల కొరకు రాజ్యాధికారం కొరకు కృషి చేశారు.బహుజనులు పాలకులుగా ఎదగాలని రాజ్యాంగంలో పొందుపరిచిన ఫలాలను బహుజనులకు అందే విధంగా కృషి చేసారు.పాముసూరు గ్రామంలో జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలకోల యాదగిరి రాష్ట్ర దళిత నాయకుడు మరియు సర్పంచ్ రాష్ట్ర నాయకులు గ్రామ దళిత పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొని జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినారు. సర్పంచ్ సంపత్ రెడ్డి ఉప సర్పంచ్ తాళ్ళపల్లి శివ గౌడ్,బిజెపి రాష్ట్ర నాయకులు యుగంధర్ రెడ్డి మరియు పాలాటి వెంకన్న , దళిత కళా మండలి జిల్లా అధ్యక్షులు వార్డు మెంబర్ కల కోల దాస్, పాలాటి ఎల్లయ్య, పాలాటి భాస్కర్, కలకోల సుమన్, కలకోల వెంకటేష్, కలకోల శ్రీనివాస్, కలకోల సుధాకర్, కలకోల యాకస్వామి, బాల్లె పూలమ్మ, బాల్లె కొమురెల్లి, బాల్లె వెంకటయ్య, జోగు నరసయ్య, పాలాటి సుధాకర్ మరియు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య








**తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఏప్రిల్ 05**

హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో విశిష్ట పాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు. సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే దళిత వర్గాలకు సమాన అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల వల్లనే తాను దళిత బిడ్డగా పార్లమెంట్ స్థాయికి ఎదగగలిగానని పేర్కొన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజం మరింత చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా విద్యా రంగంలో ప్రభుత్వ, కార్పొరేట్ పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని, దళిత మేధావులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.ఎస్సీ వర్గాలు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వచ్చే ఏడాదిలో బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈకార్యక్రమంలో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు, ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : ఏ.ఎస్.కుమార్






**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / ఏప్రిల్ 06, ఖమ్మం జిల్లా :** ప్రజారాజ్యమండలి తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభ హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 15 16 17 తేదీలలో జరగబోతుందని ఈ మహాసభను కళాకారులు జయప్రదం చేయాలని సీనియర్ నాయకులు ఏఎస్ కుమార్ పిలుపునిచ్చారు. ఈరోజు ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం బోడిపూడి విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు నామ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో ఏ ఎస్ కుమార్ జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు మరియు జానపద ఉత్సవాలు ఈనెల 15 16 17 తేదీలలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరగబోతున్నాయని ఈ మహాసభలు జయప్రదానికి కళాకారులు చేయూతనివ్వాలని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మోటమర్రి జగన్మోహన్రావు, నందిగామ కృష్ణ నోముల పుల్లయ్య, నరేందర్, షేక్ ఇమామ్, ఏ సనంద రావు, వంకాయల చరణ్, ఉపేందర్, భిక్షం, సత్యం, వెంకటేశ్వర్లు, వీరబాబు,, రజిని, సువార్త, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు





**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/ధర్మసాగర్ ఏప్రిల్ 05**
హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆయన 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు పుట్ట ప్రశాంత్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా గంగారపు శ్రీనివాస్ మాదిగ (ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి) మరియు గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా పాల్గొన్నారు. ముందుగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గంగారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్తగా దేశానికి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. చమర్ కులంలో జన్మించిన ఆయన, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడని తెలిపారు. 1935లో ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ స్థాపనలో కీలక పాత్ర పోషించిన ఆయన, అదే సంవత్సరం బీహార్ శాసనసభకు ఎన్నికయ్యారు. 1946లో జవహర్ లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తరువాత భారత తొలి కార్మిక మంత్రిగా, అలాగే రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా సామాజిక న్యాయాన్ని రాజ్యాంగంలో ప్రతిష్టింపజేయడంలో ముఖ్య పాత్ర వహించారు. అతను 40 సంవత్సరాలకు పైగా కేంద్రంలో వివిధ శాఖల్లో కేబినెట్ మంత్రిగా సేవలందించారు. 1971 యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ బంగ్లాదేశ్ ఆవిర్భావానికి తోడ్పడ్డారు. వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవం, 1974 కరువు సమయంలో ఆహార సంక్షోభ నివారణలో కీలక పాత్ర పోషించారు. అత్యవసర పరిస్థితి సమయంలో ఇందిరా గాంధీకు మద్దతు ఇచ్చినా, 1977లో కాంగ్రెస్‌ను విడిచి జనతా పార్టీ కూటమిలో చేరి తరువాత ఉప ప్రధానమంత్రిగా సేవలందించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి (బీజేపీ జిల్లా నాయకులు), పుట్ట ప్రదీప్ (కాంగ్రెస్ మండల నాయకులు), గంగారపు శ్యామ్ (వార్డు 13 సభ్యుడు), పుట్ట ప్రణయభాస్కర్ (ఎంఆర్పీఎస్ మండల నాయకులు)తో పాటు పుట్ట జ్ఞానరాజ్, పుట్ట చైతన్య, పల్లెపెల్లి అనిల్, చింత తిలక్, మేకల రాజు, కొట్టె ప్రణయభాస్కర్, కొట్టె అనుచరణ్, కొట్టె దేవరాజు, కొట్టె రవి, పొలుమారి రాజు, మాచెర్ల పౌలు తదితరులు పాల్గొన్నారు.

# 6న ఖమ్మంలో అమరజీవి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ ప్రథమ వర్ధంతి సభ

**- హాజరుకానున్న తమ్మినేని వీరభద్రం**





**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / ఏప్రిల్ 05, ఖమ్మం జిల్లా :** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ యర్రా శ్రీకాంత్ ప్రథమ వర్ధంతి సభ ఏప్రిల్ 6 తేదీన సోమవారం ఉదయం 8 గంటలకు, ఖమ్మం నగరంలోని 3 టౌన్ ప్రాంతంలో ఉన్న బోస్ బొమ్మ సెంటర్ లో ఆయన ప్రథమ వర్ధంతి సభ జరుగుతుందని, ఈ వర్ధంతి సభలో సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ఆయనతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ పి.సుదర్శన్ రావు పాల్గొంటారని వారితో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు హాజరవుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 6తేదీన సోమవారం, ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే వర్ధంతి సభకు నాయకులు కార్యకర్తలు సమయాన్ని పాటించి, హాజరు కావలసిందిగా కోరారు.
వర్ధంతి సభ లో పార్టీ జిల్లా, డివిజన్, మండల కమిటీ సభ్యులు,పార్టీ సభ్యులు, మరియు పార్టీ శ్రేణులంతా తప్పక హాజరు కావలసిందిగా నున్నా తన ప్రకటన లో కోరారు.

# దళితుల సమగ్రాభివృద్ధికి అంబెడ్కర్, జగ్జీవన్ రామ్ రెండు కళ్ల లాంటి వారు

**- దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు ఒకరు**

**- ఆ రాజ్యాంగ అమలుకు విశేష కృషి చేసిన మహానుభావులు ఇంకొకరు**





**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 05**
దళితుల సమగ్రాభివృద్ధికి బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ఇద్దరూ రెండు కళ్లులాంటివారని మాజీ ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీహరి మాట్లాడుతూ, దేశానికి మహత్తరమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మార్గదర్శకత్వం వహించగా, ఆ రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందేలా కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. తన జీవితాంతం అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. దళిత, పేద విద్యార్థులకు విద్య అందించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను ప్రవేశపెట్టిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అని, అలాగే పేదల ఆకలి తీర్చేందుకు రేషన్ దుకాణాల వ్యవస్థను ఆలోచించిన గొప్ప నాయకుడని తెలిపారు. అవకాశం ఇస్తే దళితులు ఏ రంగంలోనైనా రాణించగలరని తన పనితీరుతో నిరూపించిన నాయకుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. ఆయన ఆశయాలను అందరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. తనకు సోషల్ వెల్ఫేర్ మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో 100 గురుకుల పాఠశాలలను ప్రారంభించడంతో పాటు, ఇప్పటికే ఉన్న పాఠశాలలను ఇంటర్ స్థాయి వరకు అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. అలాగే 2016లో అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 125 ఎస్సీ గురుకులాలను ఏర్పాటు చేయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహం శిథిలావస్థలో ఉందని, 2027 ఏప్రిల్ 05 నాటికి కొత్త కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ పేరుతో రూ.2 కోట్లతో ఆధునిక భవనాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డీవో వెంకన్న తదితర ప్రజాప్రతినిధులు, , కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలి

**- ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా ప్రకటించాలి**

**- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్**





**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / ఏప్రిల్ 05, ఖమ్మం జిల్లా :**
ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా ప్రకటించి వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం న భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్ లో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు కొరకు ప్రభుత్వం చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు పగిడిపల్లి వెంకట్రావు, సుభాష్ పివాల్, సి హెచ్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం సమానత్వమే ఊపిరిగా జీవించిన యోధుడు: గురజాల"

**--సత్తుపల్లి డిపోలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు**





**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్05(తెలుగుగళం)న్యూస్:**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) సత్తుపల్లి డిపోలో ఆదివారం డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి గురజాల పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ
భారతదేశానికి ఆయన చేసిన విశేషమైన సేవలు మరువ లేనివని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని అన్నారు. భారతదేశానికి తొలి ఉప ప్రధానిగా ఆయన అత్యంత బాధ్యతాయుతంగా పని చేశారని తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ చేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో: డిపో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి,వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ జగన్నాథం, వెంకటయ్య,బసవయ్య, బాలస్వామి,టీ ఐ త్రీ జాకబ్, ఏడీసీలు కిరణ్ బాబు, కాంతారావు,సత్యం,పల్లె వెలుగు బస్ మేనేజర్ కిన్నెర ఆనంద్ వీరితోపాటు గ్యారేజీ సిబ్బంది,ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక
సోమవారం,
ఏప్రిల్ 06 2026



# వేంసూరులో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహణ"



**వేంసూరు,ఏప్రియల్05(తెలుగుగళం)న్యూస్:** ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూ జగజ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు,సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో:ఎల్ డి సి శ్రీనివాస్,ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ నూతన కమిటీ ఎన్నిక




**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**
మరిపెడ మున్సిపల్ కేంద్రం లోని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ సమావేశం నిర్వహించడం జరిగింది,ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జనగం తిరుపతి, ఇస్లావత్ నగేష్ ఆధ్వర్యంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది,నూతన జిల్లా అధ్యక్షులుగా గుండ గాని ఉప్పలయ్య గౌడ్,ఉపాధ్యక్షులుగా నాగరాజు,కార్యదర్శిగా శ్రీనివాసచారి, జాయింట్ సెక్రటరీగా మాడుగుల వెంకన్న, కోశాధికారిగా చిత్తలూరి చంద్రశేఖర్, డిస్టిక్ కమాండెంట్ రమేష్ రెడ్డి, పిఆర్ఓ గా సునీల్, ఈసీ నెంబర్ గా నాగేశ్వరరావు, ఈ కార్యక్రమంలో గంధసి రమేష్ గౌడ్,మామిడాల మునేష్,వెంకటనారాయణ,పరశురాములు,నవీన్ రెడ్డి, ఉపేందర్,సత్య శ్రీనివాస్ గౌడ్,మహేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు

# వేంసూరులో ఎస్సీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు"



**వేంసూరు,ఏప్రియల్05(తెలుగుగళం)న్యూస్:** ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని షెడ్యూల్ కులాలకు చెందిన యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆహ్వానించినట్లు ఎంపీడీవో (ఎఫ్ఏసీ) భూక్యా రంజిత్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో మీడియాకు తెలిపారు. ఈ పథకాలలో భాగంగా రవాణా రంగంలో విద్యుత్ ద్విచక్ర వాహనాలు, విద్యుత్ త్రిచక్ర వాహనాలు, పశుసంవర్ధక రంగంలో పాలిచ్చే పశువులు, వ్యవసాయ రంగంలో సౌర శక్తి ఆధారిత యూనివర్సల్ పంపు నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అదనంగా వేతన ఉపాధి మరియు స్వయం ఉపాధికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 8గా నిర్ణయించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి భౌతిక దరఖాస్తులు సమర్పించని వారు, అలాగే కొత్తగా దరఖాస్తు చేసే వారు కూడా తమ దరఖాస్తులను ఏప్రిల్ 8 సాయంత్రం 5 గంటలలోపు వేంసూరు ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని అధికారులు తెలిపారు.

# బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకల్లో నివాళు లర్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

**- అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్న ఎమ్మెల్యే నాగరాజు**
**- విద్య ద్వారా జీవితాన్ని మార్చుకోవచ్చని విద్యార్థులకు పిలుపునిచ్చారు**

**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్/ఏప్రిల్5**
అణగారిన వర్గాలకు ఆశాకిరణం, సామాజిక పోరాటాలకు మార్గదర్శకం, సమానత్వం కోసం నిరంతరం పాటుపడిన మహానాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మరియు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ గారి 118వ జయంతి సందర్భంగా నేడు ఎల్బీ స్టేడియం సమీపంలో గల ఆయన విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ,అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ శ్రీ మల్లు రవి, సహచర ఎమ్మెల్యేలు మందుల సామెల్, కవ్వంపల్లి సత్యనారాయణలతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కే.ఆర్. నాగరాజు పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు..అనంతరం ఏర్పాటు చేసిన 118వ జయంతి ఉత్సవాలలో పాల్గొని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు



మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ అణగారినవర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన పోరాటం భారత దేశ రాజకీయ, సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో పనిచేశారని, ఆయన చూపిన మార్గంలో నడవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన చేసిన సేవలు నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. అలాగే సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, యువత ముఖ్యంగా ఆయన జీవితం నుంచి ప్రేరణ పొందాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు....భారతదేశానికి జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివని, చదువు మన తలరాతను మారుస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, మాజీ హనుమంతరావు తో సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాబా టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ ఇన్స్టిట్యూట్ లో టైపింగ్ మాక్ టెస్ట్!

**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం ఏప్రిల్ 06, ఖమ్మం జిల్లా:** తెలంగాణ ఉన్నత న్యాయ స్థానము వివిధ జిల్లా న్యాయస్థానాలలో స్టెనో, టైపిస్ట్, కాపీస్ట్ పోస్టుల భర్తీ నిమిత్తం ఫిబ్రవరి/2026 లో నోటిఫికేషన్ జారీ చేస్తూ ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్ ప్రక్రియ ద్వారా అప్లై చేసుకోవలని నోటిఫికేషన్ లో తెలియజేయడం జరిగింది. ఈ ప్రక్రియలో భాగంగా ఉన్నత న్యాయ స్థాన అధికార యంత్రాంగం అప్లై చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు టైపింగ్ స్కిల్ టెస్ట్ ను ఏప్రిల్ 10/2026 వ తేదీ శుక్రవారం హైదరాబాద్ నగరంలోనీ వివిధ పరీక్షా కేంద్రాలలో టైపింగ్ స్కిల్ టెస్ట్ ఉదయం టైపిస్ట్ పోస్టులకు మధ్యాహ్నం కాపిస్ట్ పోస్టులకు పరీక్ష నిర్వహించే విధంగా సంబంధిత అడ్మిట్ కార్డులను అర్హులైన అభ్యర్థులకు జారీ చేయడం జరిగింది. ఈ స్కిల్ టెస్ట్ కు హాజరవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు బాబా టైప్ ఇన్స్టిట్యూట్ లో 5.04.2026 ఆదివారం ఉదయం స్కిల్ టెస్ట్ అవగాహన నిమిత్తం, దిశా, నిర్దేశం చేస్తూ ఒక గ్రాండ్ మాక్ టెస్టును ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ బాబా నిర్వహించటం జరిగింది. ఈ టెస్ట్ లో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొనడం జరిగింది. ఈ టైపింగ్ మాక్ టెస్ట్ నిర్వహణలో ముఖ్యఅతిథిగా టిఆర్ఎస్ జిల్లా నాయకులు తోట



రామారావు పాల్గొని పరీక్ష ప్రశ్నాపత్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వంగలా వెంకట్, చేతి కృష్ణ, కిషన్ నాయక్ నవీన్, అబ్దుల్, దొడ్డ వెంకటేశ్వర్లు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ఖండన- -మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పట్టణ బీఆర్ఎస్ నాయకులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ,రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేత క్యాంపు కార్యాలయంపైనే దాడులు జరుగుతుండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు కలిగిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గూండాల మాదిరిగా ప్రవర్తిస్తూ,ప్రతిపక్షాలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒక ప్రతిపక్ష నేత కార్యాలయంలో బలవంతంగా ప్రవేశించి పోస్టర్లు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజలు ఈ విధమైన రాజకీయాలను గమనిస్తున్నారని,తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పోలీసులు చట్టాన్ని కాపాడాల్సింది పోయి,పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనే




ఆరోపణలు వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడుతున్న వారిని అడ్డుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రజలకు భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని గుర్తుచేశారు. భూపాలపల్లి జిల్లాలో ఇటీవల జరుగుతున్న దొంగతనాలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలుభయాందోళనలకు గురవుతున్నారని, శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, మున్సిపల్ పరిపాలనలో లోపాలున్నాయని, బడ్జెట్ ప్రవేశపెట్టే విధానంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓడిపోయిన అభ్యర్థులు ప్రభుత్వ కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవడం సరైంది కాదని అన్నారు. విద్యా రంగంపై మాట్లాడిన గండ్ర,ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, విద్యార్థులపై భారమవుతోందని పేర్కొన్నారు. హైకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే పరిస్థితి మారిందని అన్నారు. రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ,జిల్లాలో మక్కజొన్న పంట సిద్ధమైనప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని విమర్శించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల సాధనలో మహిళలు సంఘటితంగా ముందుకు రావాలి: జాజిరి జ్యోతి(ఐద్వా జిల్లా నాయకురాలు)

**సిద్ధారం గ్రామంలో ఐద్వా నూతన కమిటీ ఏర్పాటు"**



**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్05(తెలుగుగళం)న్యూస్:** ఖమ్మంజిల్లా సత్తుపల్లి మండలం సిద్ధారం గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సమావేశానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సంఘం బలోపేతంపై చర్చించారు.సమావేశంలో 11 మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ



అధ్యక్షురాలిగా రేగుల మంగమ్మ, కార్యదర్శిగా వాసం సీతారావమ్మలను ఎంపిక చేశారు. ఇతర సభ్యులను కూడా బాధ్యతల ప్రకారం నియమించి సంఘ కార్యకలాపాలను గ్రామ స్థాయిలో విస్తరించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐద్వా జిల్లా నాయకురాలు జాజిరి జ్యోతి హాజరై ప్రసంగించారు. మహిళల హక్కుల సాధనలో ఐద్వా కీలక పాత్ర పోషిస్తోందని ఆమె తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు వచ్చి తమ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అర్హులకు చేరేలా మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు సంఘం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కమిటీ గ్రామంలోని మహిళల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా సభ్యులు పాల్గొని కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు.

# రేగొండలో సంచలనం సృష్టించిన హత్య కేసు

**- అక్రమ సంబంధం నేపథ్యంతో తండ్రిని గొడ్డలితో నరికి చంపిన కుమారులు**

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రేపాక గ్రామంలో జరిగిన దారుణ హత్య ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది.అక్రమ సంబంధం నేపథ్యంలో ఇద్దరు కుమారులు కలిసి తమ తండ్రిని గొడ్డలితో నరికి హత్య చేసిన ఈ ఘటన మండలవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.పోలీసుల వివరాల ప్రకారం,రేపాక గ్రామానికి చెందిన కుర్రే చేరాలు (55) అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో కొంతకాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు.ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిసి తరచూ వివాదాలకు దారితీసింది.ఈ వ్యవహారంపై ఇప్పటికే కుటుంబంలో ఉద్రిక్తతలు నెలకొనగా,కుమారులు తండ్రి ప్రవర్తనపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ వచ్చారు.ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్‌లో ఉన్న కుర్రే రామ్,కుర్రే లక్ష్మణ్ గ్రామానికి చేరుకుని నేరానికి పాల్పడ్డారు.రాత్రి సుమారు 1:20 గంటల సమయంలో మహిళ నివాసానికి వెళ్లి తలుపులను బలవంతంగా తెరచి లోపలికి ప్రవేశించారు.అక్కడ తండ్రి చేరాలను మహిళతో కలిసి చూసిన వారు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు.ఈ క్రమంలో కుర్రే రామ్ చేరాలను పట్టుకోగా,కుర్రే లక్ష్మణ్ తన వెంట తీసుకువచ్చిన గొడ్డలితో తలపై తీవ్రంగా దాడి చేశాడు.ఒక్కసారిగా జరిగిన ఈ దాడిలో చేరాలు తీవ్రంగా గాయపడ్డాడు.అడ్డుకోవడానికి ప్రయత్నించిన మహిళపై కూడా దాడి చేసి, ఆమె మెడలో ఉన్న



బంగారు తాడును లాక్కొని అక్కడి నుండి నిందితులు పరారయ్యారు.స్థానికులు గమనించి వెంటనే గాయపడిన చేరాలను సమీప ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున సుమారు 4:30 గంటల సమయంలో మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుని అన్న కుర్రే కుమార్ ఫిర్యాదు మేరకు రేగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు



ప్రారంభించారు.నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు సీఐ సిహెచ్. కరుణాకర్ రావు తెలిపారు.ఈ సంఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా,ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.గ్రామ ప్రజలు ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ,నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణాలో ఈ అరాచకం ఏమిటి

**ఇల్లెందు, ఏప్రిల్ 5:** తెలంగాణ తొలి ముఖ్యమ ంత్రి, ప్రతిపక్ష నాయకులు, గజ్వేల్ నియోజ కవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ గూండాల దాడికి నిరసనగా బీఆర్ఎస్ నాయకులు దిండి గాల రాజేందర్ ,పార్టీ శ్రేణులు. నల్ల జెండా లతో నిరసన తెలిపారు. క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ గూండాల దాడికి నిరసనగా ఆదివార ం నల్ల జెండాలతో నిరసన ర్యాలీని దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో తెలంగాణా తల్లి (జగదాంబ) సెంటర్ లో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భ ంగా రాజేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ క్యాంపు కార్యాలయం అంటే ప్రభుత్వం ప్రతిపక్ష నాయకునికి కేటాయించిన సెమి రెసిడెంట్.. కుంటి సాకులతో దానిపై దాడికి దిగి ధ్వంసం చేసి భీభత్సం సృష్టించడమంటే ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడమేనని... అంటే తెలంగాణా జాతిపిత తెలంగాణా తొలి ముఖ్యమంత్రి పై చేసిన దాడి, అంతేకాదు యావత్ తెలంగాణా జాతి మీద జరిగిన దాడి ఇది. స్వయంగా ముఖ్యమంత్రి హోమ్ శాఖ మంత్రిగా ఉన్న రాష్ట్రంలో పట్టపగలు కాంగ్రెస్ గుండాలు ప్రయివేట్ సైన్యంలా వ్యవహరిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు ప్రశాంతంగా అభివృద్ధికి నిలయమైన తెలంగాణాలో ఈ అరాచకం ఏమిటి. గజ్వేల్ రాజకీయ పరిణామ



లు రాష్ట్రంలో ప్రజా వాగ్దానాలను నెరవేర్చ డంలో విఫలమైన రేవంత్ సర్కార్ చిల్లర పనులతో చిల్లర రాజకీయాలు చేస్తుంది.మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంపై వందల మంది చూస్తుండగా పట్టపగలు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం శోచనీయమని రాజేందర్ విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంపై వందల మంది చూస్తుండగా పట్టపగలు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం శోచనీయమని రాజేందర్ విమర్శించారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ దుండగులను వెంటనే గుర్తించి,అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని రాజేందర్ డిమాండ్ చేసారు.

## రేషన్ షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్ :** మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ () ఆదివా రం బేగంపేట డివిజన్ ఓల్డ్ కష్టమ్ బస్తీలో రేషన్ షాప్ ( ) ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకులు పూర్తిస్థాయిలో ఇవ్వడం, గోధుమలు ఇవ్వడంలేదని రేషన్ లబ్ధిదారులు వెల్లడించారు. గోధుమలు ఎందుకు ఇవ్వడం లేదని నిర్వాహ కుడిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇస్తున్నా మని చెప్పగా, ఇవ్వడం లేదని స్థానికులు చెప్పడంతో రేషన్ షాప్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలపై తగు చర్యలు తీసుకోవాల ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు.స్థానికంగా ఉన్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయం 3వ వార్షికో త్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలో పాల్గొన్నా రు. అనంతరం నిర్వాహ కులు ఆయనను సన్మా నించారు. కార్యక్రమ ంలో ఆలయ కమిటీ సభ్యు లు నగేష్, అశోక్ యాదవ్, ప్రశాంతి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షు డు శ్రీనివాస్ గౌడ్, ఆరీఫ్, నరేష్ ఉన్నారు.

# డ్రగ్స్ నెట్‌వర్క్‌లో రోహిత్ రెడ్డి సోదరుడే కీలకం సిట్ దర్యాప్తులో ఎన్నో కొత్త విషయాలు

**హైదరాబాద్ :**మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ, కాల్పుల కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తున్నాం యి. రోహిత్ రెడ్డి అక్రమ లావాదేవీలకు ఆయన సొంత సోదరుడు రితేష్ రెడ్డి బినామీగా వ్యవహరిస్తున్నట్లు సిట్ బృందం దర్యాప్తులో తేలింది. ఆరోజు డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో రితేష్ రెడ్డి పాత్ర కేవలం అతిథిగా మాత్రమే లేదని మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన అనేక ఆర్థిక వ్యవహారాలను, ఆస్తులను రితేష్ తన పేరు మీద నిర్వహిస్తున్నట్లు ఆధారాలు లభిం చాయి. డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న వ్యక్తులతో జరిపిన లావాదేవీల వెనుక రితేష్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.మరో కస్టడీ పిటిషన్ : రితేశ్ రెడ్డి బినామీ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన అధికారులు కొన్ని ప్రాథమిక ఆధారాలను సైతం అధికారులు సేకరించారు. రోహిత్‌రెడ్డి తరఫున రితేశ్ కొన్ని లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో బయటపడ్డాయి. వీరిద్దరి బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాలు పరిశీలించినప్పుడు అనుమానాస్పద నగదు,



ఆన్‌లైన్ లావాదేవీలు గుర్తించారు. పోలీస్ కస్టడీలో వీటి గురించి ప్రశ్నించినప్పుడు నిందితులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వలేదని వీటి వెనుక నిజాలు నిగ్గుతేల్చేందుకు మరో 3 రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు ఉప్పర్‌పల్లిలోని న్యాయస్థానంలో సమాధానాలతో సరి : రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి.. దిల్లీ వ్యాపారి నమిత్ శర్మను పోలీసులు ఈ నెల 15న అరెస్టు చేసి రెండు విడతల్లో 6 రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. మరో మూడు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ శనివారం పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం వాదనలు వింటామని న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ సందర్భంగా నిందితులు విచారణకు సహకరించడం లేదంటూ పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి మూడు రోజులు కస్టడీకి తీసుకుని విచారించినా ముగ్గురు నిందితులు ఏమాత్రం సహకరించడం లేదని కస్టడీ పిటిషన్‌లో పేర్కొన్నారు. డ్రగ్స్ ఎలా వచ్చాయి ఎవరు అందించారు లావాదేవీలు ఎలా జరిగాయి ఇతరుల ప్రమేయం గురించిటిషన్‌లో వెల్లడించారు. కొన్ని ప్రశ్నలకు పొడిపొడి సమాధానా లిస్తున్నారు. డ్రగ్స్ పార్టీల కోసం ఎక్కడికి వెళ్లారు? హోటల్ బుకింగ్‌ల గురించి లోతుగా ఆరా తీసినా పూర్తి వివరాలు ఇవ్వడం లేదని కస్టడీ పిటిషన్‌లో తెలిపారు.డ్రగ్స్ సరఫరాకు మూలాలెక్కడ? : డ్రగ్స్ పార్టీలు జరిగినప్పుడు వీరితో పాటు పాల్గొన్న వినియోగదారుల గురించి సమాధానాలివ్వడం లేదని తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎంతో మంది అనుమానితుల పేర్లు వెలుగులోకి వస్తున్నా వీరి గురించి పూర్తి సమాచారం రావాలని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన సమాచారంతో పాటు మత్తు పదార్థాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు మరిన్ని సేకరించాల్సి ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. వాస్తవాలు సేకరించాలన్నా, పరారీలో ఉన్న మరికొందరు నిందితుల్ని గుర్తించి అరెస్టు చేయాలన్నా వీరిని కస్టడీకి తీసుకోవడం తప్పనిసరి. వారిచ్చిన వాంగ్మూలాలను పరిశీలించి డ్రగ్స్ సరఫరా గొలుసును ఛేదించాలి. నిందితుల డ్రగ్స్ పార్టీల వెనుక భారీ నెట్‌వర్క్‌తో పాటు ఎంతో మంది పెడ్లర్లు, నిర్వాహకులు ఉన్నారు. గతంలో డ్రగ్స్ పార్టీలు చేసుకున్న ప్రాంతాలకు వెళ్లి, కొన్ని ఆధారాలు సేకరించాల్సి ఉంది. రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి మధ్య ఆన్‌లైన్ లావాదేవీల వెనుక ఇతరుల పాత్ర గురించి ప్రశ్నించాల్సి ఉంది. దిల్లీకి చెందిన వ్యాపారి నమిత్‌శర్మ అతడి చిరునామా, నేపథ్యం, నేర చరిత్ర గురించి సమర్పించిన ఆధారాలను తనిఖీ చేయాల్సి ఉందని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు.

# కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరు పెట్టే యోచనలో కవిత.. పాత పేరు, కొత్త అజెండా.. సిద్దిపేట, గజ్వేల్‌లో పోటీకి రెడీ


**హైదరాబాద్ :**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత .. కొత్త పార్టీ పెట్టే ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఈనెల 25వ తేదీన తన కొత్త పార్టీ ఆవిర్భా వోత్సవం ఉంటుందని ఇప్పటికే ప్రకటించిన కవిత.. దానికి సంబంధించిన ఏర్పాట్లను.. జాగృతి చూసుకుంటోందని వెల్లడిం చారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం వద్ద కొత్త పార్టీకి సంబంధించిన నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు ఇప్పటికే తెలిసింది. అయితే తాజాగా కొత్త పార్టీకి సంబంధించి కవిత చేసిన వ్యాఖ్యలు.. తీవ్ర ఆసక్తికరంగా మారాయి. తన కొత్త పార్టీకి టీఆర్ఎస్ పేరు పెట్టేందుకు కవిత, జాగృతి నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు రావడం ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది.రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి



(టీఆర్ఎస్) పేరు ఇప్పుడు ఖాళీగా ఉందని.. తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు చేయడం సరికొత్త చర్చకు దారి తీస్తోంది. అదే సమయంలో పాత పేరు, కొత్త జెండా, అజెండాతో తెలంగాణ ప్రజల ముందుకు వస్తానని చెప్పడంతో.. కొత్త పార్టీకి టీఆర్ఎస్ అనే పేరు పెడతారా అనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం టీఆర్ఎస్ పేరును ఎవరైనా వాడుకోవచ్చని వ్యాఖ్యలు చేసిన కవిత.. తమ పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఒకవేళ పార్టీకి టీఆర్ఎస్ పేరు పెట్టినా జెండాలో మాత్రం గులాబీ రంగు ఉండదని కవిత చెప్పినట్లు తెలుస్తోంది.తెలంగాణ రాష్ట్ర సమితి పేరు పెట్టాలనే ఆలోచన చేస్తున్నామని.. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా జాగృతి టీమ్ పని చేస్తుందని కవిత తెలిపారు. బిహార్ సిద్ధాంతాలు తమ పార్టీలో ఉండవని తేల్చి చెప్పారు. పార్టీ ఆవిర్భావం రోజున అమరవీరుల స్థూపం వద్దకు వెళ్తామని చెప్పారు. ఆరోజున స్టేజ్ పైన ఉద్యమ కారులు ఉంటారని తెలిపారు. డీఎస్పీ విశారదన్ మహారాజ్‌తో కలిసి తాము పనిచేస్తామని కవిత వెల్లడించారు. తమకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ధనిక పార్టీ అని ఆరోపించారు.ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచి పోటీ చేస్తాను అనే దానిపైనా కవిత హింట్ ఇచ్చారు. సిద్దిపేట నియోజకవర్గంలో మహిళా రిజర్వేషన్లు వస్తే తప్పకుండా పోటీ చేస్తానని కవిత తేల్చి చెప్పారు. గజ్వేల్‌లో మహిళా రిజర్వేషన్ వచ్చినా ఆలోచిస్తానని తెలిపారు. నిజామాబాద్‌లో కూడా చాలా సీట్లు ఈ సారి మహిళా రిజర్వేషన్‌లోకి వస్తాయని పేర్కొన్నారు. కేసీఆర్ కష్టపడితేనే టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని.. అలాగే జాగృతి కోసం తాము కష్టపడతామని కవిత వెల్లడించారు. ఆడబిడ్డకు ఓటేయడం అనేది ఒక ఎమోషన్ అని పేర్కొన్నారు. తాను భగవద్గీత చాలాసార్లు చదివానని.. ఇంకా చదువుతూనే ఉన్నట్లు చెప్పిన కవిత.. అందులో ఉన్న నీతి చాలా గొప్పదని.. యుద్ధం చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ ఆంక్షలు.. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే!

**హైదరాబాద్ :**జూబ్లీహిల్స్ పరిధిలోని కేబీఆర్ పార్క్ వద్ద జరుగుతున్న స్టీల్ ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనుల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ జామ్ అవ్వకుండా ఉండేందుకు కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వేను అమలు చేయాలని భావిస్తు న్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రయల్ రన్ నిర్వహించా రు.పంజాగుట్ట నుంచి మాదాపూర్ వెళ్లే వాహనాలను రోడ్డు నంబర్ 2 నుంచి వన్‌వేగా మళ్లించారు. అంటే టీవీ9 ఆఫీసు నుంచి వచ్చే వాహనాలను కేబీఆర్ పార్క్ వద్ద ఎడమ వైపునకు మళ్లించారు. అక్కడి నుంచి తెలంగాణ భవన్, సీవీఆర్ జంక్షన్, బాలకృష్ణ నివాసం మీదుగా జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, మాదాపూర్ వెళ్లే



విధంగా ట్రాఫిక్‌ను డైవర్ట్ చేశారు. ట్రయల్ రన్‌లో భాగంగా ఇవాళ రెండు గంటల పాటు కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వేను అమలు చేశారు. ఇందులో తలెత్తిన సమస్యలు, లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత.. ఈ రూట్‌లో వన్‌వే అమలు చేయాలా? వద్దా? అనే దానిపై ట్రాఫిక్ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

## స్కూటీని ఢీకొట్టి.. 5 కిలోమీటర్లు లాక్కెళ్లిన డీసీఎం.

**హైదరాబాద్:** మాదాపూర్‌లో ఓ డీసీఎం వాహ నం బీభత్సం సృష్టించింది. ఓ స్కూటీని ఢీకొట్టి 5కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ఒక మహిళ మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడ యాలో వైరల్‌గా మారింది.వివరాల్లోకి వెళ్తే.. కేరళకు చెందిన హనియ్యా ఆయేషా (22), అబ్దుల్ బాసిత్ దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడే మహే శ్వరం సమీపంలో ఉంటూ మలబార్ జువెల్లరీ షాపులో పనిచేసుకుంటున్నారు. శనివారం సాయంత్రం ఎప్పటిలాగే విధులు పూర్తి చేసుకు న్న దంపతులు.. చిన్న షాపింగ్ చేసుకుని ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో మాదా పూర్ మైండ్ స్పేస్ సమీపంలో వారి స్కూటీని ఓ



డీసీఎం ఢీకొట్టింది.స్కూటీ టైర్ల కింద ఈడ్చుక ుంటూ వస్తున్నా డీసీఎం వ్యాన్ను ఆపలేదు. అలా ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత స్థానికులు గమనించి డీసీఎంను అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. క్లీనర్‌ను స్థానికులు పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

# క్రికెట్‌తో ఉత్సాహం... వాకింగ్‌తో ఆరోగ్యం

## మరిపెడ ఎస్ఐ వీరభద్రరావు

**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా** మరిపెడ పట్టణంలో పోలీస్ శాఖ ప్రజలకు మరింత దగ్గర కావాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఎస్ఐ వీరభద్రరావు ఆదివారం ఉదయం రామకృష్ణ వెంచర్‌లో యువకులతో కలిసి



క్రికెట్ ఆడుతూ సందడి చేశారు. యువతతో కలిసిమెలిసి క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సమాజంలో సానుకూల వాతావరణం నెలకొంటుందని ఆయన తెలిపారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అంతకుముందు ఆర్కే వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాసబత్తిని సతీష్ నేతృత్వంలో టీ-షర్ట్‌ల పంపిణీ ఎస్సై వీరభద్రరావు చేతుల మీదుగా



కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరభద్రరావు మాట్లాడుతూ నిత్య వాకింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ప్రతిరోజూ నడక వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటం, బరువు నియంత్రణలో ఉండటం, మధుమేహం మరియు రక్తపోటు నియంత్రణకు సహకరించడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. అలాగే మానసిక ఒత్తిడి తగ్గి ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక యువత, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాసబత్తిని సతీష్,అనంత రాములు,రవికుమార్, అనుముల రామిరెడ్డి, గంధసిరి వేణు,జాగృతి సుధాకర్ రెడ్డి, గండి విష్ణు,శ్రీను పాల్గొన్నారు.

# రూ.7.20 కోట్లు పెట్టినందుకు వడ్డీతో సహా చెల్లించేస్తున్నాడు..



ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ అదృష్టం మామూలుగా లేదు. ముఖ్యంగా ఆ జట్టు నమ్ముకున్న యువ లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తన మాయాజాలంతో గుజరాత్ టైటాన్స్ నోటికాడ ముద్దను లాగేసుకున్నాడు. గత రెండు సీజన్లలో ఫామ్ లేక ఇబ్బంది పడ్డ ఈ స్పిన్ మాంత్రికుడు, ఇప్పుడు రాజస్థాన్ జెర్సీలో సింహంలా గర్జించాడు. గుజరాత్ చేతుల్లో ఉందనుకున్న మ్యాచ్‌ను తన 4 వికెట్ల స్పెల్‌తో ఒక్కసారిగా మలుపు తిప్పాడు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చాలా ధీమాగా కనిపించింది. ముఖ్యంగా సాయి సుదర్శన్ 73 పరుగులతో క్రీజులో పాతుకుపోయి మ్యాచ్‌ను గుజరాత్ వైపు తిప్పేస్తున్నాడు. ఆ సమయంలో బంతిని అందుకున్న రవి బిష్ణోయ్, తన గూగ్లీలతో మాయ చేశాడు. వరుసగా రెండు వికెట్లు తీసి గుజరాత్ ఇన్నింగ్స్‌ను దెబ్బతీశాడు. మొత్తం 4 ఓవర్లలో 41 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా సెట్ బ్యాటర్ సాయి సుదర్శన్ వికెట్ తీయడమే ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్ అని చెప్పాలి.మ్యాచ్ అనంతరం బిష్ణోయ్ తన మనసులోని మాటను పంచుకున్నాడు. “గత సీజన్ నాకు చాలా కష్టంగా గడిచింది. నా లెంగ్త్ విషయంలో చిన్న పొరపాటు జరిగినా బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లు బాదేవారు. అందుకే ఈసారి ఆఫ్-సీజన్‌లో నా బౌలింగ్ లెంగ్త్ మీద, శారీరక దృఢత్వం మీద చాలా వర్కౌట్ చేశాను. డొమెస్టిక్ క్రికెట్ ఆడి నా తప్పులను సరిదిద్దుకున్నాను. ఈరోజు నేను వైవిధ్యంగా బౌలింగ్ చేయడం వల్లే బ్యాటర్లు తడబడ్డారు” అని వివరించాడు. బిష్ణోయ్ ప్రదర్శన వల్ల రాజస్థాన్ రాయల్స్ వరుసగా రెండో విజయం నమోదు చేసి పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌కు చేరుకుంది.

# తగలరాని చోట బంతి తగిలే.. కన్నీళ్లు పెట్టిన మహ్మద్ సిరాజ్



రాజస్థాన్ రాయల్స్ జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో అశోక్ శర్మ వేసిన మొదటి బంతిని యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ బలంగా బాదాడు. ఆ బంతి బ్యాట్ అంచుకు తగిలి బౌండరీ వైపు వేగంగా దూసుకెళ్లింది. వెనక వైపు ఫీల్డింగ్ చేస్తున్న మహ్మద్ సిరాజ్ ఆ బంతిని అడ్డుకోవడానికి తన ప్రాణాలను పణంగా పెట్టి గాలిలో దూకాడు. బంతిని ఆపే క్రమంలో అతను మైదానంలోనే పల్టీలు కొడుతూ బౌండరీ అవతల పడిపోయాడు. నొప్పితో విలవిలలాడిన సిరాజ్..బంతిని ఆపినప్పటికీ, సిరాజ్ కిందపడిన విధానం చూస్తే ఏదో పెద్ద ప్రమాదమే జరిగినట్లు అనిపించింది. బంతి మీద పడి దొర్లడంతో అతని శరీరానికి తీవ్రమైన గాయం తగిలింది. భరించలేని నొప్పితో సిరాజ్ అక్కడే కుప్పకూలిపోయి ఏడవడం ప్రారంభించాడు. వెంటనే జట్టు వైద్యులు మైదానంలోకి వచ్చి అతనికి ప్రాథమిక చికిత్స అందించారు. సిరాజ్ ముఖంలో కనిపిస్తున్న బాధను చూసి క్రీడాకారులు, స్టేడియంలోని ప్రేక్షకులు ఆందోళనకు లోనయ్యారు. జట్టులో అత్యంత కీలకమైన బౌలర్ ఇలా గాయపడటం గుజరాత్ జట్టుకు పెద్ద దెబ్బగా భావించారు.సిరాజ్ మైదానాన్ని వీడటంతో అతను ఈ మ్యాచ్‌లో మళ్ళీ ఆడతాడా లేదా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, కాసేపటి తర్వాత గుజరాత్ అభిమానులకు శుభవార్త అందింది. ఆ గాయం అంత తీవ్రమైనది కాదని, కేవలం స్వల్ప నొప్పి మాత్రమేనని వైద్యులు తేల్చారు. తక్కువ సమయంలోనే కోలుకున్న సిరాజ్, తిరిగి మైదానంలోనే కోలుకున్న సిరాజ్, తిరిగి మైదానంలోకి అడుగుపెట్టి తన బౌలింగ్ కోటాను పూర్తి చేశాడు. అతను తిరిగి రావడంతో స్టేడియం ఒక్కసారిగా చప్పట్లతో మారుమోగిపోయింది. ఈ మ్యాచ్‌లో సిరాజ్ మొదట కొంచెం ఎక్కువ పరుగులు ఇచ్చినప్పటికీ, గాయం తర్వాత తిరిగి వచ్చి తన పోరాట పటిమను చాటుకున్నాడు. 32 ఏళ్ల ఈ వేగవంతమైన బౌలర్ టీమ్ ఇండియాకు మరియు ఐపీఎల్ జట్టుకు ఎంత ముఖ్యమో ఈ సంఘటన మరోసారి నిరూపించింది. అతని పట్టుదల, ఆట పట్ల ఉన్న నిబద్ధతను నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసిస్తున్నారు. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# ఐపీఎల్ మధ్యలోనే స్వదేశానికి వెళ్లిన స్టార్ ప్లేయర్



సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ షాక్..ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న వేళ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు రెగ్యులర్ కెప్టెన్, ఆస్ట్రేలియా దిగ్గజం ప్యాట్ కమిన్స్ అర్ధాంతరంగా జట్టును వీడి స్వదేశానికి పయనమయ్యారు. వెన్నునొప్పి గాయం తీవ్రతరం కావడంతో ఫిట్‌నెస్ పరీక్షల నిమిత్తం ఆయన ఆస్ట్రేలియాకు వెళ్లడం ఇప్పుడు ఆరెంజ్ ఆర్మీ అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.పాట్ కమిన్స్ గత కొంతకాలంగా వెన్నునొప్పితో సతమతమవుతున్నాడు. ఈ గాయం కారణంగానే ఆయన గతేడాది యాషెస్ సిరీస్‌తో పాటు టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే తాను మొదటి సగం మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనని కమిన్స్ స్పష్టం చేశాడు.పాట్ కమిన్స్ గత కొంతకాలంగా వెన్నునొప్పితో సతమతమవుతున్నాడు. ఈ గాయం కారణంగానే ఆయన గతేడాది యాషెస్ సిరీస్‌తో పాటు టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే తాను మొదటి సగం మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనని కమిన్స్ స్పష్టం చేశాడు.ప్రస్తుతం నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్నప్పటిక ఓడిపోయినప్పటికీ, రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి ఫామ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉన్న హైదరాబాద్, తన తదుపరి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. కమిన్స్ తిరిగి వచ్చే వరకు కిషనే జట్టును నడిపించనున్నాడు.కమిన్స్ గైర్హాజరీలో విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో హైదరాబాద్ ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో ఓడిపోయినప్పటికీ, రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి ఫామ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉన్న హైదరాబాద్, తన తదుపరి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. కమిన్స్ తిరిగి వచ్చే వరకు కిషనే జట్టును నడిపించనున్నాడు.

# మీరు లోన్ ఈఎంఐ చెల్లించకుంటే ఎంత పెనాల్టీ పడుతుంది?




బ్యాంకు పర్సనల్ లోన్, హోమ్ లోన్ తీసుకుంటే క్రమం తప్పకుండా ఈఎంఐలు చెల్లించడం తప్పనిసరి ఒక వేళ చెల్లించని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. అయితే మీరు ఒక నెల పాటు మీ గృహ రుణ జువీ×ని సకాలంలో చెల్లించలేకపోతే భయపడాల్సిన అవసరం లేదు. ఇది తరచుగా జీతం ఆలస్యం, ఊహించని ఖర్చులు లేదా వైద్య అత్యవసర పరిస్థితుల కారణంగా జరుగుతుంది. జువీ× గడువు తేదీ ముగిసిన వెంటనే బ్యాంక్ వ్యవస్థ మీ ఖాతాను గడువు ముగిసినట్లు చూపించడం ప్రారంభిస్తుంది. ప్రారంభంలో మీకు టెక్స్ట్ సందేశం లేదా ఇమెయిల్ ద్వారా రిమైండర్ అందుతుంది. ఆలస్యం మరికొన్ని రోజులు కొనసాగితే బ్యాంక్ కలెక్షన్ బృందం కాల్ చేసి కారణాన్ని విచారించవచ్చు.
ఈ ఆలస్యానికి బ్యాంక్ ఆలస్య చెల్లింపు ఛార్జీ లేదా జరిమానా వడ్డీని విధిస్తుంది. ఈ మొత్తం బ్యాంక్, రుణ ఒప్పందాన్ని బట్టి మారుతుంది. ఇది సాధారణంగా బాకీ ఉన్న జువీ×పై అదనపు వడ్డీగా జోడిస్తారు. ఆలస్యం ఎంత ఎక్కువగా ఉంటే ఛార్జ్ అంత ఎక్కువగా ఉంటుంది. ఆలస్యం జరిగితే వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది.ఇది కూడా చదవండి: ఒక బ్యాంకులో ఎన్ని లక్షలు ఉంచాలో మీకు తెలుసా..? నియమాలు ఏంటిఒకే ఒక్క జువీ× ఆలస్యం వల్ల తమ క్రెడిట్ స్కోరు తగ్గుతుందని ప్రజలు తరచుగా భయపడతారు. అయితే బ్యాంకులు సాధారణంగా జువీ× 30 రోజుల కంటే ఎక్కువ ఆలస్యం అయితే మాత్రమే క్రెడిట్ బ్యూరోలకు సమాచారాన్ని నివేదిస్తాయి. మీరు ఒక నెలలోపు బ్యాలెన్స్‌ను తిరిగి చెల్లిస్తే దాని ప్రభావం పెద్దగా ఉండదు. అయితే, జువీ×లు పదే పదే ఆలస్యం అయితే, మీ జ×దీ×ూ స్కోరు వేగంగా పడిపోవచ్చు. భవిష్యత్తులో కొత్త రుణం పొందడం కష్టమవుతుందిబ్యాంకు ఆ ఇంటిని తిరిగి స్వాధీనం చేసుకోగలదా? ఈఎంఐ మిస్ అయిన వెంటనే ఇంటిని లీగల్ నోటీసు లేదా స్వాధీనం చేసుకోవు. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం.. వరుసగా 90 రోజులు చెల్లింపులు చేయకపోతేనే రుణాన్ని చీూూగా పరిగణించాలి. అప్పుడే తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభమవుతాయి. దీని అర్థం ఒక నెల పాటు చెల్లించకపోవడం వల్ల మీ ఇల్లు కోల్పోయే ప్రమాదం ఉండదు. కానీ నిరంతర నిర్లక్ష్యం ఖరీదైనది కావచ్చు.అటువంటి పరిస్థితిలో ఏమి చేయాలి?మీరు జువీ× మిస్ అయి ఉంటే మీ బ్యాంకును సంప్రదించి కారణాన్ని వివరించండి. జరిమానాతో సహా మొత్తాన్ని వీలైనంత త్వరగా తిరిగి చెల్లించడానికి ప్రయత్నించండి. సమస్య కొనసాగితే మీరు బ్యాంకుతో రీషెడ్యూల్ లేదా మారటోరియం వంటి ఆప్షన్‌ల గురించి బ్యాంకు సిబ్బందితో చర్చించవచ్చు.

# క్రెడిట్ కార్డు యూజర్లకు అలర్ట్ బిల్లుగా ముందుగా కడితే ఏం అవుతుంది?




ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు దాదాపు ప్రతి ఒక్కరు వాడుతున్నారు. కానీ నెలవారీ బిల్లు జనరేట్ అయిన వెంటనే, ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతుంది. స్టేట్‌మెంట్ అందిన వెంటనే బిల్లు చెల్లించాలా, లేదా గడువు తేదీ వరకు వేచి ఉండటం మంచిదా? బిల్లు చెల్లింపు సమయం మీ క్రెడిట్ స్కోర్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి ఈ గందరగోళం తరచుగా వినియోగదారులలో కొనసాగుతుంది. ఈ విషయంలో సరైన దశలను, అది మీ ఆర్థిక జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం..మీ ఇమెయిల్ లేదా ఫోన్‌లో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ సందేశం వచ్చినప్పుడు, చాలా మంది గడువు తేదీ వరకు వేచి ఉంటే వారి జ×దీ×ూ స్కోరు పడిపోతుందేమో అని ఆందోళన చెందుతారు. వాస్తవం ఏమిటంటే మీరు స్టేట్‌మెంట్ వచ్చిన వెంటనే చెల్లించాలా లేదా గడువు తేదీలోపు మీ బిల్లును చెల్లించడానికి గ్రేస్ పీరియడ్‌ని ఉపయోగించాలా అనేది మీ క్రెడిట్ స్కోరుకు పట్టింపు లేదు. మీ చెల్లింపు బ్యాంకు నిర్దేశించిన గడువులోపు జరిగితే, మీ ఆర్థిక రికార్డు పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. మీ ఆర్థిక సౌలభ్యం, నగదు లభ్యతను బట్టి మీరు ఏదైనా ఎంపికను ఎంచుకోవచ్చుగడువు తేదీ వరకు వేచి ఉండటంలో తప్పు లేదు, కానీ నిర్లక్ష్యం కారణంగా ఈ గడువు దాటితే, మీకు నిజమైన ఇబ్బంది మొదలవుతుంది. బ్యాంకు గడువు తర్వాత చెల్లింపు చేయడం ఆలస్య చెల్లింపుగా పరిగణించబడుతుంది. ఇది మీ మొత్తం క్రెడిట్ చరిత్రను తీవ్రంగా దెబ్బతీసే తీవ్రమైన తప్పు. మీ జ×దీ×ూ స్కోరు దెబ్బతిన్న తర్వాత, భవిష్యత్తులో గృహ రుణం, కారు రుణం లేదా కొత్త కార్డు పొందడం చాలా కష్టం అవుతుంది. అందువల్ల, బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక ప్రాధాన్యతగా చేసుకోవడం చాలా ముఖ్యం.క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లలో ఎల్లప్పుడూ రెండు రకాల మొత్తాలు కనిపిస్తాయి. మొత్తం బకాయి, కనీస బకాయి. కనీస మొత్తాన్ని లేదా కనీస బకాయిని చెల్లించడం వల్ల బ్యాంకు జరిమానాలను నివారించవచ్చని, వారి శ్రేయస్సును నిర్ధారిస్తుందని ప్రజలు తరచుగా అనుకుంటారు. అయితే ఆర్థిక దృక్కోణం నుండి, ఇది ఒక పెద్ద ఉచ్చు అని నిరూపించబడింది. మిగిలిన మొత్తం అంటే కనీస మొత్తం, వచ్చే నెలకు ముందుకు తీసుకెళ్లబడుతుంది. బ్యాంకులు దానిపై గణనీయమైన వడ్డీని వసూలు చేస్తాయి. ఈ అలవాటు క్రమంగా గణనీయమైన అప్పుకు దారితీస్తుంది. మీ క్రెడిట్ స్కోర్‌పై దాని ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఎల్లప్పుడూ పూర్తి బిల్లును చెల్లించండి.

# రికార్డ్ స్థాయిలో తిరిగి పుంజుకున్న రూపాయి విలువ! 13 ఏళ్లలో తొలిసారి!



భారత కరెన్సీ మార్కెట్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. =దీ× తీసుకున్న రెండు దశల కఠిన చర్యలు మార్కెట్‌ను ఒక్కసారిగా కుదిపేశాయి. ఈ చర్యల ప్రభావంతో గురువారం రూపాయి విలువ 1.8 శాతం పెరిగి 93.10 వద్ద ముగిసింది. ఇది దాదాపు 13 ఏళ్లలో అత్యంత భారీ ఒక్కరోజు లాభంగా నిలవడంతో పాటు, రూపాయి-డాలర్ సమతుల్యతను తాత్కాలికంగా మార్చింది. గత కొన్ని నెలలుగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ వచ్చింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గ్లోబల్ వాణిజ్య ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల వంటి కారణాల వల్ల 2026 ఆర్థిక సంవత్సరంలో రూపాయి దాదాపు 10 శాతం వరకు పడిపోయింది.మార్చి నెలలోనే అదనంగా 4 శాతం క్షీణించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్‌బిఐ సాధారణంగా అనుసరించే డాలర్ విక్రయాలు, వడ్డీ రేట్ల మార్పులు వంటి చర్యలు సరిపోకపోవడంతో, మరింత కఠిన నిర్ణయాలకు దిగింది. ప్రత్యేకంగా బ్యాంకులు ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ మార్కెట్ల మధ్య ధరల వ్యత్యాసాన్ని ఉపయోగించుకుని ఆర్బిట్రేజ్ ట్రేడింగ్ ద్వారా లాభాలు ఆర్జిస్తున్నాయని ఆర్‌బిఐ గుర్తించింది. ఈ ప్రక్రియలో డాలర్‌కు కృత్రిమ డిమాండ్ పెరగడంతో రూపాయి మరింత బలహీనపడుతోంది. ఈ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు, బ్యాంకుల నికర ఓపెన్ పొజిషన్‌ను కేవలం 100 మిలియన్ డాలర్లకు పరిమితం చేస్తూ ఆర్‌బిఐ ఆదేశాలు జారీ చేసింది.ఈ నిర్ణయం వల్ల పెద్ద ఎత్తున డాలర్ పొజిషన్లను తగ్గించాల్సి వచ్చిన బ్యాంకులు, మార్కెట్‌లో డాలర్లను అమ్మడం ప్రారంభించాయి. దాంతో సరఫరా పెరిగి రూపాయి బలపడింది. అయితే ఈ చర్యలతో బ్యాంకింగ్ రంగంపై ఒత్తిడి పెరిగింది. నిఫ్టీ బ్యాంక్ సూచీ సుమారు 4 శాతం పడిపోవడం మార్కెట్‌లోని ఆందోళనను ప్రతిబింబించింది. విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ మార్పుల వల్ల బ్యాంకులకు వేల కోట్ల రూపాయల నష్టం సంభవించే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే ఆర్‌బిఐ చర్యలు కేవలం తాత్కాలిక జోక్యం కాకుండా, కరెన్సీ మార్కెట్‌లో నియంత్రణను బలోపేతం చేసే దిశగా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలుగా భావించబడుతున్నాయి. భవిష్యత్తులో గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు, మూలధన ప్రవాహాలు రూపాయి దిశను నిర్ణయించనున్నాయి.



## ఆ హీరో నన్ను తిట్టాడు.. ఆరోజు చాలా గొడవ జరిగింది.. షాకింగ్ విషయం చెప్పిన జేడీ చక్రవర్తి

నటుడు జేడీ చక్రవర్తి తన కెరీర్‌లోని పలు ఆసక్తికరమైన సంఘటనలను, ముఖ్యంగా తన బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ గా భావించిన వాటిని గతంలో ఒక ఇంటర్వ్యూలో వివరించారు. వాటిలో నాగార్జునతో శివ చిత్రం షూటింగ్‌లో జరిగిన ఒక సంఘటన కీలకం. ఈ సంఘటన హైలైట్ కేఫ్‌లో చోటుచేసుకుంది. జేడీ చక్రవర్తి కొత్త నటుడిగా తన మొదటి సినిమా షూటింగ్‌లో ఉండగా, నాగార్జున గారు అప్పటికే స్టార్‌డమ్‌లో ఉన్నారు. ఆయన బయటికి వస్తుండగా జేడీ చక్రవర్తి అనుకోకుండా ఢీకొన్నారట. దీనిపై నాగార్జున కోపంగా మాట్లాడటం, చూసుకొని నడవవా.? అని అనడం, అనంతరం జేడీ చక్రవర్తిని కొట్టడం జరిగిందని వివరించారు. మొదట అది ఒక పెద్ద గొడవగా, బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ గా అనిపించినప్పటికీ, ఇది నిజానికి ముందుగా ప్రణాళిక చేసిన ఒక ఫైట్ సీక్వెన్స్ అని జేడీ చక్రవర్తి వెల్లడించారు.అప్పుడు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, గోపాల్ రెడ్డిలు ఈ సన్నివేశాన్ని క్యాండిడ్‌గా చిత్రీకరించాలని నిర్ణయించారని, ఇది శివ సినిమాలో ఇరానీ కేఫ్ ఫైట్‌గా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. ఈ సంఘటన కేవలం సినిమా చిత్రీకరణలో భాగంగా జరిగిందని, అందుకే ఇది గుడ్ ఎక్స్‌పీరియన్స్ అని అన్నారు. అయితే, తన అసలైన బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ హీరోయిన్ ఆమలతో జరిగిన ఒక ఇబ్బందికర సంఘటన అని జేడీ చక్రవర్తి పేర్కొన్నారు. శ్రీదేవి తర్వాత తాను ఎక్కువగా ఆరాధించే నటి అమల అని ఆయన తెలిపారు. ఒక సన్నివేశం చిత్రీకరణ జరుగుతున్నప్పుడు, పాఠశాల నుంచి ఎవరో ఒక అమ్మాయిపై రాళ్లు విసురుతున్నారని జేడీ చక్రవర్తి గమనించారు. అమల అప్పటికే పుష్పక్ వంటి చిత్రాలలో నటించి తనకు ఎంతో అభిమానమని, అందుకే ఆ విషయం చెప్పడానికి ఉత్సాహంగా అమల వద్దకు వెళ్లినప్పుడు, తాను చెప్పదలచుకున్న విషయాన్ని సరిగ్గా వ్యక్తం చేయలేకపోయానని అన్నారు.

సమ్మర్ సమ్మర్, సో అండ్ సో అని తడబడినప్పుడు, అమల ఎవరో రాళ్లు విసురుతున్నారని చెప్పదలుచుకున్నారా?" అని ప్రశ్నించడం తనకు చాలా అవమానకరంగా, ఇబ్బందికరంగా అనిపించిందని జేడీ చక్రవర్తి గుర్తుచేసుకున్నారు. ఇవి కాకుండా, వ్యతిరేకతను కూడా వెల్లడించారు. తెలుగు భాషలో తనకు ఇష్టం లేని ఏకైక పదం అన్నయ్య అని ఆయన స్పష్టం చేశారు. బావ అనే పదంపై ఎక్కువ జేడీ చక్రవర్తికి అన్నయ్య అనే పదంపై ఉన్న వ్యతిరేకతను కూడా వెల్లడించారు. తెలుగు భాషలో తనకు ఇష్టం లేని ఏకైక పదం అన్నయ్య అని ఆయన స్పష్టం చేశారు. బావ అనే పదంపై ఎక్కువ ఇష్టం ఉందని పేర్కొన్నారు. అలాగే, నాగార్జున హీరోగా నటించిన సినిమాలో తాను మొదటిసారి నటించగా, నాగచైతన్య హీరోగా ఉన్న జోష్ చిత్రంలో విలన్‌గా చేశానని తెలిపారు. ఈ సంఘటనలన్నీ తన సినిమా ప్రయాణంలో భాగమేనని జేడీ చక్రవర్తి వివరించారు.



## దుమ్మురేపిన డెకాయిట్ ట్రైలర్.. అడవి శేష్ ఇరగదీశాడబ్బా..!

యంగ్ హీరో అడవి శేష్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ డెకాయిట్. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు అడవి శేష్. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఇప్పుడు డెకాయిట్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సినిమా నుంచి తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. ఈ సినిమా ట్రైలర్ సినిమా పై అంచనాలు పెంచేసింది.డెకాయిట్ కథ ఒక మాజీ ప్రేమ జంట చుట్టూ తిరుగుతుంది. ఒకప్పుడు ఒకరినొకరు ప్రేమించిన ఈ జంట, అనుకోని పరిస్థితుల వల్ల విడిపోతారు. ఆ తర్వాత జరిగిన సంఘటనల వల్ల ఒకరు జైలుకి వెళ్ళడం, మరొకరి ద్రోహం వంటి అంశాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ట్రైలర్ లో స్టంట్స్ చాలా నేచురల్‌గా ఉండటం, సినిమాకు ఒక హాలీవుడ్ తరహా ఫీల్ ఇస్తుంది. ట్రైలర్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా కీలక పాత్ర పోషించింది. డార్క్ టోన్‌కు సరిపోయేలా మ్యూజిక్ ఉండటం వల్ల ప్రతి సీన్ మరింత ఇంపాక్ట్‌ఫుల్‌గా కనిపిస్తుంది. విజువల్స్ కూడా స్టైలిష్‌గా, ఇంటెన్స్‌గా ఉండటం సినిమా క్వాలిటీని తెలియజేస్తుంది.ఈ ట్రైలర్ చూసినటి అంశాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ట్రైలర్ లో స్టంట్స్ చాలా నేచురల్‌గా ఉండటం, సినిమాకు ఒక తర్వాత, సినిమా మీద ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగిందని చెప్పాలి.ఇక అడవి శేష్‌కు జోడీగా ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుంది. షానీల్ డియో ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. అన్నపూర్ణ స్టూడియోస్ ఒ సోనీ పిక్చర్స్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్ లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఏప్రిల్ 10న డెకాయిట్ సినిమా గ్రాండ్ గా విడుదలకానుంది

## దడపుట్టించే సైకో క్రైమ్ థ్రిల్లర్ ఇది.. చూడటం మొదలు పెడితే కళ్ళు తిప్పరంతే

:




ప్రస్తుతం ఓటీటీలో సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాలదే హవా. భాషతో సంబంధం లేకుండా ఈ జానర్ సినిమాలు, సిరీస్ లను చూసేస్తున్నారు ఆడియెన్స్. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగానే ఓటీటీ సంస్థలు కూడా ఇంట్రెస్టింగ్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలు, వెబ్ సిరీస్ లను ఆయా భాషల్లోకి అనువాదం చేసి మరీ స్ట్రీమింగ్ కు తీసుకొస్తున్నాయి. అలా కొన్ని రోజుల క్రితం ఓటీటీలోకి వచ్చిన ఓ వెబ్ సిరీస్ టాప్ ట్రెండింగ్ లో కొనసాగుతోంది. సాధారణంగా ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్ల మూవీస్, వెబ్ సిరీస్ లలో కిల్లర్ లేదా క్రిమినల్ ఎవరన్నది చివరి దాకా రివీల్ చేయరు. కానీ ఈ సిరీస్ లో మాత్రం రెండో ఎపిసోడ్ లోనే సీరియల్ కిల్లర్ ను రివీల్ చేస్తారు. అతను హత్యలు ఎలా చేస్తున్నాడో చూపిస్తారు. అయినా ఈ సిరీస్ ఆసక్తిని కోల్పోదు. ఈ సిరీస్ కథ మొత్తం ఓ సీరియల్ కిల్లర్ కేసు చుట్టూనే తిరుగుతుంది. అతి చిన్న వయస్సులో ముంబై నగరానికి డీసిపి అయిన రీటా ఫెరారియా ఈ కేసును ఒక ఛాలెంజింగ్ గా తీసుకుంటుంది. ఉన్నట్లుండి నగరంలో వరుసగా హత్యలు జరుగుతూ ఉంటాయి. ఆ హత్యలు కూడా ఒకే పంథాలో జరుగుతుంటాయి. ఓ సీరియల్ కిల్లర్ పోలీసులకు ఒక చిన్న క్లూ కూడా వదలకుండా చాలా పకడ్బందీగా ఈ మర్డర్లు చేస్తుంటాడు.

## అందాల ముద్దుగుమ్మ రిద్ధి కుమార్..

ఈ అమ్మడు రాజ్ తరుణ్ హీరోగా నటించిన లవర్ అనే సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసింది. లవర్ సినిమాలో అందం, అభినయంతో కట్టిపడేసింది రిద్ధి కుమార్. చాలా కాలం గ్యాప్ తీసుకున్న తర్వాత ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ సినిమాలో కీలకపాత్రలో కనిపించింది.ఈ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది. రాధేశ్యామ్ సినిమాలో ఒక చిన్న పాత్రలు తళుక్కున మెరిసింది ఈ ముద్దుగుమ్మ. రాధేశ్యామ్ సినిమాలో అర్చరీ ప్లేయర్ గా కనిపించింది. ఈ బ్యూటికి అనుకున్నంతగా అవకాశాలు కూడా టాలీవుడ్ లో రావడం లేదు.

ఈ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది. రాధేశ్యామ్ సినిమాలో ఒక చిన్న పాత్రలు తళుక్కున మెరిసింది ఈ ముద్దుగుమ్మ. రాధేశ్యామ్ సినిమాలో అర్చరీ ప్లేయర్ గా కనిపించింది. ఈ బ్యూటికి అనుకున్నంతగా అవకాశాలు కూడా టాలీవుడ్ లో రావడం లేదు.ఇటీవలే ప్రభాస్ హీరోగా నటించిన రాజా సాబ్ సినిమాలో నటించింది. రాజా సాబ్ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించింది కానీ ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. రాజాసాబ్ సినిమాలో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది ఈ సుందరి. ఇటీవలే ప్రభాస్ హీరోగా నటించిన రాజా సాబ్ సినిమాలో నటించింది. రాజా సాబ్ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించింది కానీ ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. రాజాసాబ్ సినిమాలో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది ఈ సుందరి. కానీ తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోతుంది. అలాగే అటు మలయాళంలోనూ వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ లేటేస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. నెట్టింట గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కవ్విస్తుంది. కానీ తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోతుంది. అలాగే అటు మలయాళంలోనూ వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ లేటేస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. నెట్టింట గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కవ్విస్తుంది. కెరీర్ తొలినాళ్లలో ఈబ్యూటీ గ్లామర్ రోల్స్ చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో ఈ భామకు అవకాశాలు అంతగా రావడం లేదని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం గ్లామర్ రోల్స్ లోనూ కనిపిస్తూ మెప్పిస్తుంది రిద్ధి కుమార్.

కెరీర్ తొలినాళ్లలో ఈబ్యూటీ గ్లామర్ రోల్స్ చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో ఈ భామకు అవకాశాలు అంతగా రావడం లేదని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం గ్లామర్ రోల్స్ లోనూ కనిపిస్తూ మెప్పిస్తుంది రిద్ధి కుమార్.



టాలీవుడ్ లో కొత్త అందాలు ప్రేక్షకులను కవ్విస్తున్నాయి. సినిమా సినిమాకు కొత్త కొత్త అందాలు ప్రేక్షకులను కవ్విస్తున్నాయి. ఈ క్రమంలోనే ముద్దుగుమ్మ శివాని నాగరం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఈ అమ్మడు కేవలం నటి మాత్రమే కాదు గాయని , కూచిపూడి నృత్యకారిణి కూడా.ఈ ముద్దుగుమ్మ 2024లో విడుదలైన "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రంలో ఆమె సుహాస్ సరసన లక్ష్మి పాత్రలో నటించి, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది.ఈ ముద్దుగుమ్మ 2024లో విడుదలైన "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రంలో ఆమె సుహాస్ సరసన లక్ష్మి పాత్రలో నటించి, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది.శివాని ఈ అవకాశాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన ఆడిషన్ మెసేజ్ ద్వారా పొందింది, మొదట హీరోయిన్ స్నేహితురాలి పాత్ర కోసం వెళ్లి, తర్వాత హీరోయిన్‌గా ఎంపికైంది. ఇక ఇటీవలే ఈ సుందరి లిటిల్ హార్ట్స్ అనే సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.శివాని ఈ అవకాశాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన ఆడిషన్ మెసేజ్ ద్వారా పొందింది, మొదట హీరోయిన్ స్నేహితురాలి పాత్ర కోసం వెళ్లి, తర్వాత హీరోయిన్‌గా ఎంపికైంది. ఇక ఇటీవలే ఈ సుందరి లిటిల్ హార్ట్స్ అనే సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.అంతేకాకుండా, శివాని గాయనిగా కూడా తన ప్రతిభను చూపించింది, ఆరంభం అనే సినిమాలో అమాయకంగా అనే పాటను ఆలపించింది, ఇది ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ.. తన ఫొటోలతో అభిమానులను ఆకర్షిస్తోంది.అంతేకాకుండా, శివాని గాయనిగా కూడా తన ప్రతిభను చూపించింది, ఆరంభం అనే సినిమాలో అమాయకంగా అనే పాటను ఆలపించింది, ఇది ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ.. తన ఫొటోలతో అభిమానులను ఆకర్షిస్తోంది.ఆమె మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటుంది ఈ భామ. ఇటీవలే సుహాస్ సరసన హే బలవంత్ అనే సినిమాలో నటించింది. ఆమె తన సహజమైన అందం, నటనా నైపుణ్యంతో యువతలో మంచి క్రేజ్ సొంతం చేసుకుంటుంది. శివాని హైదరాబాద్‌కు చెందిన తెలుగు అమ్మాయి. తెలుగు నటీమణులకు సినిమా రంగంలో మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటుంది ఈ భామ. ఇటీవలే సుహాస్ సరసన హే బలవంత్ అనే సినిమాలో నటించింది.




## క్యూట్ బ్యూటీ శివాని నాగారం అదరగొట్టిందిగా

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State.
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.